ప్రజాశక్తి
పశ్చిమగోదావరి

బుధవారం
జనవరి - 3
2018

12 పేజీలు



కొవ్వూరులో డిఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అన్నదేవరపేట నేతలు, కార్యకర్తలు

ఎల్‌టిఆర్‌పై అత్యుత్సాహం
పునరావాసం మందగమనం..!

పోలవరం ప్రాజెక్టులో సాగుతున్న మాయాపర్వం అందరినీ విస్మయపరుస్తోంది. అక్రమార్కుల కోసం ఆగమేఘాల మీద నిధులు విడుదల చేసిన ప్రభుత్వం.. నిర్వాసితులకు ఇచ్చే పరిహారంపై నోరు మెదపడం లేదు. ఎల్‌టిఆర్ భూముల వ్యవహారంలో సాగించిన అత్యుత్సాహం.. పునరావాసం అందించడంలో ఎక్కడా కానరాకపోవడం చూస్తే ఇదంతా వ్యూహాత్మకంగానే సాగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

- 'పోలవరం'లో మాయాపర్వం
- వ్యూహాత్మకంగా నిధులు విడుదల
- అక్రమార్కుల కోసం ఆగమేఘాలు
- నిర్వాసితుల పునరావాస సొమ్ముపై మౌనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుల్లో పోలవరం నిర్వాసితులకు అందించాల్సిన పునరావాస పరిహారంపై ప్రభుత్వం నుంచి అధికారుల వరకూ అంతా మౌనం పాటిస్తున్నారు. పరిహారం ఎప్పటికిస్తారో కూడా చెప్పడం లేదు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.6.50 లక్షల పునరావాస పరిహారం కోసం ఆయా గ్రామాల ప్రజలు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడు. అయితే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన ఎల్‌టిఆర్ భూములకు మాత్రం ఆగమేఘాల మీద నిధులు విడుదల చేసి అక్రమార్కుల ఖాతాల్లో జమ చేశారు. ఏజెన్సీలోని 1/70 చట్టప్రకారం ఏజెన్సీలోని భూములపై గిరిజనులకే సర్వహక్కులు ఉంటాయి. అయితే ఈ భూముల్లో కొంతమంది గిరిజనేతర భూస్వాములు పాగావేసి ఏళ్లతరబడి అనుభవిస్తున్నారు. గడిచిన రెండుదశాబ్దాలుగా గిరిజనులు ఎల్‌టిఆర్ భూములపై అలుపెరుగని పోరాటం సాగిస్తూనే ఉన్నారు. అనేక భూములను దక్కించుకున్నారు. గతంలో చాలా భూములపై సర్వే నిర్వహించిన అధికారులు ఆ భూములు గిరిజనులకే చెందుతాయని తీర్పులు సైతం ఇచ్చారు. టిడిపి అధికారం చేపట్టిన తర్వాత అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచింది. దీంతో ఎల్‌టిఆర్ భూముల్లో పెద్దఎత్తున అవినీతి వ్యవహారం సాగిపోయింది. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో దాదాపు ఏడువేల ఎకరాల్లో భూసేకరణ చేయగా దీనిలో సగం ఎల్‌టిఆర్ భూమి అని గిరిజనులు చెబుతున్నారు.

'పోలవరం' ముసుగులో గిరిజనులకు అన్యాయం

పోలవరం భూసేకరణ ముసుగులో ప్రభుత్వం గిరిజనులకు తీరని అన్యాయం చేసింది. అక్రమార్కులు అనుభవిస్తున్న ఎల్‌టిఆర్ భూములను భూసేకరణ పేరుతో తీసుకున్నారు. ఎకరాకు రూ.10.50 లక్షల సొమ్ము వారి ఖాతాల్లో జమచేసింది. గతంలో గిరిజనులవిగా పేర్కొన్న భూములకు సైతం సొమ్ములు అక్రమార్కులకు కట్టబెట్టేసింది. దీనికోసం తప్పుడు పత్రాలు సృష్టించినట్లు తెలుస్తోంది. గ్రామసభలు వంటివి లేకుండా గిరిజన చట్టాలకు తూట్లుపొడిచారంటూ గిరిజనులు అనేకమంది కోర్టును సైతం ఆశ్రయించారు. కోర్టుకు వెళ్లిన వారి భూములకు పరిహారం విడుదల చేయవద్దని కోర్టు ఆదేశాలు సైతం (4లో)

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు
కొవ్వూరులో మంత్రి జవహర్‌కు వ్యతిరేకంగా ఆందోళన

ప్రజాశక్తి - కొవ్వూరు

టిడిపిలో గ్రూపు తగాదాలు మరోసారి రోడ్డెక్కాయి. ఇప్పటికే చింతలపూడి, భీమవరం, ఆచంటల్లో తమ్ముళ్లు పరస్పర విభేదాలు, ఆధిపత్య పోరుతో రోడ్డెక్కిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పోరుకు కొవ్వూరు వేదికైంది. ఎక్సైజ్ మంత్రి జవహర్, ఇతరులు తమపై దాడి చేశారని తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కొందరు టిడిపి నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఆందోళన చేపట్టడం ఆ పార్టీలో నెలకొన్న ఆధిపత్య పోరును ప్రతిబింబిస్తోంది.

ఎక్సైజ్ శాఖా మంత్రి కెఎస్.జవహర్ తమను క్యాంపు కార్యాలయానికి పిలిచి దాడి చేశారంటూ అన్నదేవరపేటకు చెందిన టిడిపి నాయకులు సత్యహరిశ్చంద్ర ప్రసాద్, గణపతికృష్ణ ఆరోపిస్తూ కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. అదే సమయంలో మంత్రి కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలంటూ అన్నదేవరపేటకు చెందిన టిడిపి కార్యకర్తలు కొవ్వూరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆందోళన సంచలనం సృష్టించింది. అన్నదేవరపేట కార్యకర్తలు కొవ్వూరులోని టిడిపి కార్యాలయం వద్ద నుంచే మంత్రికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టడం గమనార్హం. వీరు ర్యాలీగా విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహి ంచారు. అనంతరం (4లో)



కొవ్వూరు డిఎస్‌పి కార్యాలయం వద్ద మంత్రికి అనుకూలంగా నినదిస్తున్న కార్యకర్తలు

గీతోపదేశం



తొలిరోజు జన్మభూమి సభలకు నామమాత్ర స్పందన



పాలకొల్లు ఏడో వార్డులో నిర్వహించిన సభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

12లో..

10,270 మందికి రేషన్ కార్డులు : ఎంపీ మాగంటి బాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో అర్హులైన 10,270 మందికి కొత్తగా రేషన్ కార్డులు అందిస్తున్నట్లు ఏలూరు ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) చెప్పారు. స్థానిక ఎంఆర్‌సి కాలనీలో మంగళవారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొత్తగా రేషన్ కార్డులుకోసం దరఖాస్తు చేసిన 10,270 మందిని ఆన్‌లైన్‌లో పొందుపరచి కార్డులు అందిస్తున్నామన్నారు. శాసనసభ్యులు బడేటి కోట రామారావు మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. నగర మేయరు షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు రాము సూర్యారావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పాలి ప్రసాద్, జన్మభూమి మా ఊరు కార్యక్రమ పర్యవేక్షణ ప్రత్యేకాధికారి కరుణకుమారి, నగరపాలకసంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ పూజారి నిరంజన్, డిప్యూటీ మేయర్ నాయుడు పోతురాజు, కార్పొరేటర్ కోరాడ దుర్గా మల్లేశ్వరి, మాజీ డిప్యూటీ మేయర్లు చోడే వెంకటరత్నం, గుడివాడ రామచంద్రకిషోర్, నగరపాలకసంస్థ కమిషనరు మోహనరావు, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో పేదలకు 12వేల గృహాలను నిర్మించనున్నట్లు ఏలూరు శాసనసభ్యులు బడేటి కోటరామారావు (బుజ్జి) చెప్పారు. స్థానిక 50వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు రాము సూర్యారావు, జన్మభూమి ప్రత్యేకాధికారి కరుణకుమారి, కార్పోరేటర్ ఎల్లపు సత్యవతి, నగరపాలకసంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, డిప్యూటీ మేయరు నాయుడు పోతురాజు, మాజీ డిప్యూటీ మేయరులు గుడివాడ రామచంక్రిషోర్, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు దాకారపు రాజేశ్వరరావు, నగరపాలకసంస్థ కమిషనరు మోహనరావు, తహశీల్దారు చంద్రశేఖర్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి :తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చింతలపూడి జెడ్‌పిటిసి సభ్యులు కె.రాధారాణి అన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చింతలపూడి మండలంలో రైతులకు నూతన సంవత్సరంలో 38 రైతురథాలను ఎంపీ మాగంటి బాబు ద్వారా అందజేసినట్లు ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రవేశపెడుతుందన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి

ఏలూరు:ఏలూరు నగరంలో పేదలకు 12 వేలగృహాలను నిర్మించనున్నట్లు ఏలూరు శాసన సభ్యులు బడేటి కోట రామారావు చెప్పారు. స్థానిక 50వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన ఐదోవిడత జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి మాట్లాడుతూ పట్టణ గృహనిర్మాణం క్రింద 12 వేల పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. తద్వారా పేద ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలుస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్ధానాలతోపాటు మరెన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. ఏలూరు 50వ డివిజన్ పేదప్రజలు తమ ఇళ్లల్లో శుభాకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువైన కళ్యాణ మండపాన్ని 40 లక్షల రూపాయలతో నిర్మిస్తామన్నారు. అసంఘటితరంగ కార్మికుల కుటుంబాల్లో యజమాని మరణిస్తే ఆకుటుంబాన్ని ఆదుకునేందుకు చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఏలూరు 50వ డివిజన్‌లో మదర్ థెరిస్సా యువజన అసోసియేషన్ ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటుకు రూ.50 వేలు అందించానని చెప్పారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఒక ఉద్యమ స్ఫూర్తితో నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఎక్కడా వెనుకడుగు వేయకుండా అన్ని కార్యక్రమాలను అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శరాష్ట్రంగా ముఖ్యమంత్రి తీర్చిదిద్దుతున్నారన్నారు. 50వ డివిజన్‌లో 160 మంది అర్హులను గుర్తించి వారిపేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, వీరందరికీ వచ్చేనేల నుంచి పింఛన్లు అందుతాయన్నారు. ఈ సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను చంద్రన్న బీమా బాండ్‌లను ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి నగర మేయరు షేక్ నూర్జహాన్ అందజేసారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు రాము సూర్యారావు జన్మభూమి ప్రత్యేకాధికారి కరుణకుమారి, కార్పొరేటర్ ఎల్లపు సత్యవతి, నగర పాలకసంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయరు నాయుడు పొతురాజు, మాజీ డిప్యూటీ మేయర్లు గుడివాడ రామచంద్రకిషోర్, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు, దాకారపు రాజేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనరు మోహనరావు, తహశీల్దారు చంద్రశేఖర్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పరిహారం కోసం అధికారుల నిలదీత

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని శ్రీధరవేలేరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో పునరవాస పరిహారంపై నిర్వాసితులు అధికారులను నిలదీశారు. గ్రామంలో గురువారం మధ్యాహ్నం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కుక్కునూరు సబ్‌కలెక్టరు ఎంఎన్.హరేంద్రీయప్రసాద్ విచ్చేశారు. ఈ తరుణంలో నిర్వాసితులంతా తమకు పునరావాస పరిహారం చెల్లించలేదంటూ అధికారులను అడిగారు. అలాగే మండలంలోని మరుగుదొడ్ల పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని, అంతర్గత రహదారులు నిర్మించాలని, తాగునీటి సమస్యల పరిష్కరించాలని వారంతా కోరారు. దీనిపై సబ్ కలెక్టరు మాట్లాడుతూ పునరావాస జాబితాలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి తుది జాబితా విడుదల చేసిన వెంటనే పునరావాస పరిహారం అందిస్తామన్నారు. మరుగుదొడ్ల బిల్లులు వెంటనే మంజూరు చేస్తామని మండలంలోని మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల నుండి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రామాంజనేయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయమా..రేషన్ షాపా..!

ఏలూరు రూరల్ మండలం కలకుర్రులో పరిస్థితి
పట్టించుకోని ఉన్నతాధికారులు
ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పంచాయతీ కార్యాలయాన్ని రేషన్ దుకాణంగా మార్చేశారు ఓ రేషన్ డీలర్. ఇదేమని అడిగితే అంతా సర్పంచి దయేనని, ఆయనే ఇక్కడ ఏర్పాటు చేసుకోమన్నారంటూ ఆ డీలర్ బదులిచ్చాడు. ఒకప్రభుత్వ కార్యాలయాన్ని రేషన్ దుకాణంగా ఎలా మార్చేశారంటూ గ్రామస్తులకు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్ళితే ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామపంచాయతీలో రేషన్ షాపును నిర్వహిస్తున్నారు. ఇదే విషయాన్ని రేషన్ డీలర్‌ను ప్రశ్నించగా తనకు ఇక్కడ విక్రయించుకోవడానికి పంచాయతీ సెక్రటరీ అనుమతిచ్చారని చెప్పు కొస్తున్నాడు. నిత్యం ఆ పంచాయతీకి ఎంతో మంది ప్రజలు వివిధ పనులకు కోసం వస్తుంటారు. పంచాయతీ కార్యాలయంలోనే రేషన్ ఇవ్వడంతో నానాఅవస్థలు పడుతున్నారు. కనీసం కార్యాలయ సిబ్బంది కూడా అందుబాటులో ఉండటం లేదు. అసలు పంచాయతీ కార్యాలయం ఉందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతోంది. ప్రజలకు ఏమైనా అవసరం వస్తే పంచాయతీ కార్యాలయానికి వెళ్తారు. అసలు అక్కడ సిబ్బంది లేకపోవడంతో తమ గోడును ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ కార్యాలయాన్ని తెరుస్తారని కొందరు చెబుతున్నారు. పంచాయతీ సెక్రటరీ ఎవరనేది అక్కడి ప్రజలకు తెలియకపోవడం శోచనీయం. కనీసం ఆయన ఫోన్ నెంబర్ కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యాలయాన్ని కేవలం రేషన్ విక్రయాలకే ఉపయోగిస్తున్నారా లేక ఇతర కార్యక్రమాలను కూడా ఉపయోగిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతుంది. ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రయివేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసలు కార్యాలయంలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు. ఎంతమంది పనిచేస్తున్నారు అనే విషయం కూడా తెలియదు. అధికారులే అందుబాటులో లేకపోతే తమ గోడును ఎవ్వరికి చెప్పుకోవాలని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి పంచాయతీలో రేషన్ షాపును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ షాపు


ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

రెడ్డి అప్పలనాయుడుపై రౌడీషీట్‌ను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెంకటాపురం మాజీ సర్పంచి రెడ్డి అప్పలనాయుడుపై రౌడీషీట్ తెరవడాన్ని నిరసిస్తూ ఏలూరులో హమాలీ జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. స్థానిక వైఎంహెచ్ఎ హాలు నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన కన్నయ్యపార్కు, ఏడు గోళీల సెంటర్, కత్తేపువీధి, గడియారస్తంభం, మెయిన్ బజార్, బిర్లాభవన్ సెంటర్ మీదుగా కూరగాయల మార్కెట్ వరకూ సాగింది. అనతరం జరిగిన ధర్నాలో రెడ్డి అప్పలనాయుడుపై రౌడీషీట్‌ను ఎత్తి వేయాలంటూ కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి యు. వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు హమాలీ జట్టు కార్మిక సంఘం నాయకులు వెంకట రమణ, అప్పారావు, నాగేశ్వరరావు, విష్ణు, తిరుపతిరావు పాల్గొన్నారు.

హమాలీల అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ బుజ్జి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

హమాలీల అభివృద్ధికి తమప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి కోట రామారావు అన్నారు. ఏలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిమ్మకాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 344 మంది హమాలీలకు, మహిళా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు మందపాటి వెంకట సూర్య సుబ్రహ్మణ్యరాజు (శేషు) అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ హమాలీల అభివృద్ధికి తాము కృషి చేస్తున్నామన్నారు. నగరంలోని హమాలీ కాలనీలో రోడ్ల సమస్య ఉందని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఫిబ్రవరిలో ఈ రోడ్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ పూజారి నిరంజన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, నిమ్మకాయల వర్తక సంఘం కార్యదర్శి గవ్వా మధుసూదనరావు, గౌరవాధ్యక్షులు నరసింహారావు, ఉపాధ్యక్షులు వేగి వెంకటేశ్వరరావు, రవికిరణ్ పాల్గొన్నారు.

'ఎన్ని జన్మభూములు నిర్వహించినా సమస్యలు యథాతథం'

చింతలపూడి :ఎన్ని జన్మభూమి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుమూడి థామస్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో గత జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో పేద ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు వందలాది పెండింగ్‌లో ఉండగా మరలా జన్మభూమి నిర్వహించడం సిగ్గుచేటన్నారు. వందల కోట్ల రూపాయలను వేలాది మంది ఉద్యోగులను నియమించి జన్మభూమి పేరుతో వృధా చేస్తున్నారని విమర్శించారు. మూడోవ విడత రుణమాఫీ చేయాల్సిన రూ.3600 కోట్లు ఇంత వరకూ విడుదల చేయలేదన్నారు. ఈ జన్మభూమి కార్యక్రమమంతా ఒక మాయ అని ఆరోపించారు.

నేడు మంత్రి జవహర్ పర్యటన

చింతలపూడి : ఈ నెల మూడో తేదీన మధ్యాహ్నం రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కెఎస్.జవహర్, స్థానిక ఎంఎల్ఎ పీతల సుజాత పర్యటించనున్నట్లు చింతలపూడి పట్టణ అధ్యక్షులు బందెల ఆశీర్వాదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తారని, అనంతరం పశువైద్యశాల భవనాన్ని ప్రారంభిస్తారిన చెప్పారు. అలాగే చింతలపూడి పట్టణంలో ఏర్పాటు చేసిన సావిత్రీబాయిపూలే విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

ఐదిళ్లు బుగ్గి..

గ్యాస్ లీకై ఎగసిన మంటలు
క్షణాల్లో దగ్ధమైన ఇళ్లు
రూ.25 లక్షల ఆస్తినష్టం
నరసాపురంలో ఘటన


దగ్ధమైన ఇళ్లు


కాలిపోయిన బంగారు వస్తువులు

ప్రజాశక్తి - నరసాపురం

కూలి పనుల కోసం వెళ్లి కూలీలు తిరిగి తమ నివాసాలకు చేరేలోపే తాము నివసిస్తున్న ఇళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన నరసాపురం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం పట్టణం 22వ వార్డు కొత్తకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఐదు తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో రెండు ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. దీనితో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం వంట చేసేందుకు స్థానిక మహిళ గ్యాస్ వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి ఇంటిలోని గ్యాస్ లీకవడంతో మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలోనే ఇళ్లన్నీ కాలి బూడిదయ్యాయి. మంటలను గ్రహించిన చుట్టుపక్కల వారు ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలను ఆర్పేందుకు స్థానికులు చాలాప్రయత్నించారు. ఈలోపు సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు. వీరు తెచ్చిన వాహనంలో నీరు అయిపోవడంతో పక్కనే ఉన్న వేములదీవి పంట కాలువలో మోటార్లు వేసి మంటలను అదుపు చేశారు. ఇళ్లల్లో ఉన్న బంగారం, వెండి, డబ్బు, దుస్తులు, ఇతర సామగ్రి, పిల్లల చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు అన్నీ మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ అగ్నిప్రమాదంలో 13 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.25లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. కూలి పనులకు వెళ్లి రోజంతా కష్టపడి దాచుకున్న సొమ్మంతా అగ్నికి ఆవుతైందని వారం రోదించారు. ఈ ప్రమాదంలో చెంచరపు మోహన్‌కుమార్, పిల్లాడి శ్యామల, పిలాటి రాములమ్మ, కొండమెంటు రాజు, సజ్జా మారెమ్మ, సజ్జా వెంకాయమ్మ, సజ్జా శ్రీనివాస్, సజ్జా బులిశ్రీను, అలబాని అచ్చాయమ్మ, అలబాని సత్యనారాయణ, మేడపాటి బంగారి, ఇస్పాకు సూర్యకాంతం, బూసి సింహాచలం, పిసిని చినతల్లి నిరాశ్రయులయ్యారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎంఎల్ఎ, సబ్ కలెక్టర్

ప్రమాదం జరిగిన వెంటనే జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. వీరి వెంట సబ్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, మున్సిపల్ ఛైర్మన్ పసుపులేటి రత్నమాల, సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నుండి రావాల్సిన తక్షణ సహాయాన్ని అందజేస్తామని ఎంఎల్ఎ తెలిపారు. దీనికి తాత్కాలికంగా స్థానిక మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి భోజన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సకాలంలో స్పందించి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక ఇన్‌ఛార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అందే రామకృష్ణను, సిబ్బందిని ఎంఎల్ఎ, సబ్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అభినందించారు.


బాధితులకు దుప్పట్లు అందిస్తున్న జనసేన నాయకులు

కొత్తపల్లి సోదరులు సాయం

అగ్ని ప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తరపున న్యాయం చేసేందుకుకృషి చేస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. స్థానిక 22వ వార్డులోని అగ్ని ప్రమాద బాధితులను ఆయన సోదరుడు, మాజీ ఎంఎల్ఎ జానకీరామ్‌తో కలిసి పరామర్శించారు. వారికి తమవంతు సాయంగా 25 కేజీల బియ్యం బాధితులకు అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన సాయం అందేలా చూస్తానని ఆయన అన్నారు. ఈయన వెంట కౌన్సిలర్లు వన్నెంరెడ్డి శ్రీనివాస్, గోరు సత్తిబాబు ఉన్నారు.

వైసిపి సాయం

అగ్ని ప్రమాద బాధితులకు వైసిపి నరసాపురం పార్లమెంటు అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు దుప్పట్లు, బట్టలు, వంట సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సాయినాథ్‌ప్రసాద్, వైకెఎస్, బర్రి శంకరం, దొంగ మురళీ, కామన బుజ్జి పాల్గొన్నారు.

'జనసేన' సహాయం

బాధితులకు జనసేన పార్టీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. కష్టాల్లో ఉన్నవారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండేటి నాగశ్రీను, కూనపరెడ్డి రామకృష్ణ, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

లభించని విద్యార్థి ఆచూకీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో సోమవారం సాయంత్రం సముద్రస్నానానికి దిగి గల్లంతైన విద్యార్థి ఆచూకీ మంగళవారం కూడా లభించలేదు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి మండలం కలగంపూడిలోని జోగయ్య జోగయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన 21మంది విద్యార్థులు సోమవారం పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. పలువురు సముద్రస్నానానికి దిగి అనంతరం ఒడ్డుకు చేరుకున్నారు. తమతోటి విద్యార్థి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కోటి గ్రామానికి చెందిన సిగురుపల్లి మోహిపాల్ అంబేద్కర్ (17) కనిపించలేదు. ఒడ్డున విద్యార్థి దుస్తులు, సెల్‌ఫోన్, తదితర సామగ్రి ఉండడంతో అలల తాకిడికి గల్లంతై ఉంటాడని భావించారు. సోమవారం రాత్రి వరకూ విద్యార్థి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన చెందారు. మంగళవారం కూడా ఆచూకీ లభించలేదు.

కోడిపందేలపై దాడి : ఐదుగురు అరెస్టు

ఉంగుటూరు:గొల్లగూడెం వద్ద జరుగుతున్న కోడిపందేల స్థావరంపై మంగళవారం దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు ఎస్ఐ తాడి వెంకటనాగరాజు పేర్కొన్నారు. వారినుంచి రెండు కోడిపుంజులు, రూ.1700 నగదు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కోడిపందేలపై సమాచారమివ్వండి

గ్రామాల్లో కోడ్డిపందేలపై విఆర్ఒలు నిఘా ఉంచి పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు.

'జన్మభూమి'లో సొమ్మసిల్లిన వృద్ధురాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోయిన ఘటన జంగారెడ్డిగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సమావేశానికి 1,2,3,4 వార్డుల ప్రజలు అధికంగా తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో రద్దీగా ఉన్న జనంలో నిలబడిన ఒక వృద్ధురాలు టిప్‌టాప్ పందిరికి కట్టిన తాడు కాలికి అడ్డుపడి కిందపడిపోయింది. ఈ ఘటనలో ఆ వృద్ధురాలు సొమ్మసిల్లింది. సమీపంలో ఉన్న బిసి సంఘ నాయకులు రాజాన సత్యనారాయణ ఆమెను లేవదీసి సపర్యలు చేశారు. జన్మభూమి కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం సిబ్బంది వృద్ధురాలికి ప్రాథమిక వైద్యం అందించారు. జన్మభూమి కార్యక్రమాలకు వచ్చే వృద్ధులకు ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేస్తే ఇలాంటి అపశృతులు జరగకుండా ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొయ్యలగూడెం : కోడిపందేల స్థావరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవన్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మంగపతిదేవిపేటలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి మూడు కోళ్లు రెండు కత్తులు, 850 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

లింగపాలెం : మండలంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి 12 మందిని అరెస్టు చేశారు. ధర్మాజిగూడెం ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నపనేనివారిగూడెంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. ఈ దాడిలో 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,840 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

గణపవరం : మండలంలోని ఎ.గోపవరంలో కోడి పందేల స్థావరంపై మంగళవారం దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ దావు హరికృష్ణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,450 నగదు, కోడిపుంజు, ఒక కోడి కత్తిని స్వాధీనపర్చుకుట్లు చెప్పారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ట్రాఫిక్ డిఎస్‌పి పి.భాస్కరరావు హెచ్చరించారు. నగరంలో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 22 మంది మద్యం సేవించిన వాహనాలు నడుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నారన్నారు. అనంతరం వారిని అబ్కారీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిలో 18 మందికి జరినామా విధించగా నలుగురికి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత మృతి

ఏలూరు సిటీ:కాలిన గాయాలతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన మాదేపల్లి వరలక్ష్మీ(28) ప్రస్తుతం భర్త జాన్‌తంబితో కలిసి కృష్ణాజిల్లా బాపులపాడు మండలం సిరివాడ ప్రాంతంలో నివస్తున్నాడు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో వరలక్ష్మీ వంటచేస్తూ అగ్ని ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలైంది. వెంటనే ఆమెను 108 వాహనంలో ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి వరలక్ష్మీ మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక ..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కడుపునొప్పి తాళలేక వ్యక్తి విషపు గుళికలు తిని మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం లింగపాలెం మండలం రాజుగూడెం గ్రామానికి చెందిన చిన్ని నాగేశ్వరరావు, భార్యాపిల్లలతో జీవిస్తూ, వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో గతకొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ప్రయివేటు వైద్యుని వద్ద మందులు వాడుతున్నప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం మధ్యాహ్నం కడుపునొప్పి ఎక్కువ కావడంతో పొలంనుంచి తెచ్చిన గుళికలను తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వరకట్న వేధింపులు భరించలేకే వర్ష ఆత్మహత్య : డిఎస్‌పి

ప్రజాశక్తి - చింతలపూడి

వరకట్నం వేధింపులు భరించలేకనే వర్ష(20) ఆత్మహత్యకు పాల్పడిందని డిఎస్‌పి మురళీకృష్ణ పేర్కొన్నారు. చింతలపూడి గంటావారివీధికి చెందిన వర్ష సోమవారం అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన తెలిసిందే. దీనిపై డిఎస్‌పి మంగళవారం విచారణ చేపట్టారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకారం టి.నరసాపురం మండలం బొర్రపాలెంలో సిండికేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.కైలాష్‌కు వర్షతో గత ఏడాది వివాహమైంది. ఇద్దరూ దగ్గర బంధువులే. వివాహ సమయంలో రూ.11 లక్షలు కట్నంగా ముట్టజెప్పారు. గత కొన్నిరోజులుగా మద్యం సేవించి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ఈ తరుణంలో డిసెంబర్ 31న అధికంగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తనతో కాపురం చేయాలంటే అదనపు కట్నం కావాలంటూ తీవ్రంగా కొట్టాడు. మనస్తాపానికి గురైన వర్ష జనవరి ఒకటో తేదీ ఉదయం ఆత్మహత్య పాల్పడింది. భర్తను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

ఇల్లు వదిలి వెళ్లేటప్పుడు సమాచారమివ్వండి

ఏలూరు సిటీ : పండుగ సెలవులకు ఊళ్లు వెళ్లేవారు లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ ద్వారా సమాచారమివ్వాలని త్రీటౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్‌పై అవగాహన కల్పించేందుకు తయారుచేసిన వాల్‌పోస్టర్లను ఆటోలకు అంటించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ అనే యాప్ ద్వారా వేరే ఊళ్లకు వెళ్లేవారు సమాచారాన్ని పొందుపరిస్తే పోలీస్ శాఖ ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. దీనిద్వారా నేరాల సంఖ్య తగ్గే అవకాశాలున్నాయని చెప్పారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

చెత్తా పారేసేందుకు రోడ్డుదాటుతున్న మహిళను కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైంది. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం మొండూరు గ్రామానికి చెందిన లక్ష్మీ భర్త అప్పలరాజు, పిల్లలతో జీవిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటిని శుభ్రం చేసిన తరువాత చెత్తను పారవేసేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చి కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీ తీవ్రగాయాలపాలైంది. చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు.

అవినీతిరహిత పాలన అందించేందుకు కృషి

కలెక్టర్ కాటంనేని భాస్కర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం అర్బన్

ప్రభుత్వ యంత్రాంగంతో నిజాయతీగా పని చేయించి ప్రజలకు అవినీతి రహిత పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ పరిధిలో 2వ వార్డులో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్మభూమిలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వంద శాతం సీసీ రోడ్లు పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. నూరుశాతం మరుగుదొడ్లు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. తాడేపల్లిగూడెం పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలో నెం.1 స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొల్లి రమావతి, యెగ్గిన నాగబాబు, ఈత కోట తాతాజీ, ఇన్‌ఛార్జ్ కమీషనర్ బ్రహ్మాజీ, మేడపాటి చల్లారెడ్డి, కోట రాంబాబు, కర్రి ప్రభాకర బాలాజీ, మున్సిపల్ అధికార్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌టిఆర్‌పై అత్యుత్సాహం.. పునరావాసం మందగమనం..!

(మొదటి పేజీ నుంచి)

జారీచేసింది. ఎల్‌టిఆర్ భూముల కింద దాదాపు రూ.300 కోట్లకు పైగానే అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఎల్‌టిఆర్ భూములకు పరిహారం అక్రమార్కులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం నుంచి అధికారుల వరకూ చూపిన అత్యుత్సాహం వెనుక పెద్దఎత్తున గోల్‌మాల్ వ్యవహారం సాగిందనే ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి. అందుకే ఆగమేఘాల మీద నిధులు విడుదల చేసి ఖాతాల్లో జమ చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అవసరం లేకపోయినప్పటికీ అదనపు భూమిని సేకరించి మరీ సొమ్ములు కట్టబెట్టారనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. ఎల్‌టిఆర్ భూములపై అంతలా అత్యుత్సాహం కనబరిచిన అధికారులు.. పునరావాస ప్యాకేజీని అందించడంలో మాత్రం చూపడం లేదని చెబుతున్నారు. పెద్దగా లాభం ఉండదనే కారణంతోనే దీన్ని పక్కకు పెట్టేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో నిర్వాసితులకు న్యాయం జరిగేనా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

(మొదటి పేజీ నుంచి)

డిఎస్‌పి కార్యాలయానికిచేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్, కృష్ణ మాట్లాడుతూ మంత్రి జవహర్ తీరును ఖండించారు. తాము సోమవారం రాత్రి మంత్రిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌పి కార్యాలయం వద్ద మంత్రికి వ్యతిరేకంగా ఆందోళన జరుగుతున్న సమయంలోనే మంత్రికి అనుకూలంగా మరికొందరు అక్కడకు చేరుకుని నినాదాలు చేయడంతో కొంత గందరగోళం, ఉద్రిక్తత వాతావరణాలు నెలకొన్నాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అనంతరం అన్నదేవరపేట నేతలు డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావును సంఘటన గురించి వివరించారు. దీనిపై డిఎస్‌పి వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, దీనిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. ఫిర్యాదుదారులు గతంలో సోషల్ మీడియాలో మంత్రి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గించేలా పోస్టులు పెట్టారని, దీనిపై మంత్రి పిఎ ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని తెలిపారు.

నేను దౌర్జన్యం చేయలేదు : మంత్రి జవహర్

తాను ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జవహర్ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఎవరితోనూ గొడవ పడే మనిషిని కాదన్నారు. అందరితోనూ స్నేహపూర్వకంగా వ్యహరిస్తానన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి కొందరు తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. తన దగ్గరకు వచ్చిన ఆ ఇరువురు వ్యక్తులతోపాటు మరికొంత మంది తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గించేలా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పెట్టారన్నారు. దీనిపై తన పిఎ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇరువురిపై కేసు నమోదైందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వారు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

నాట్లు పదిరోజులే.. తర్వాత పనుల్లేవు

వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా మహిళల ఆవేదన

ప్రజాశక్తి - గణపవరం

వరినాట్లు పదిరోజులే.. తరువాత తమకు పనులు ఉండటం లేదని మహిళా వ్యవసాయ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని సరిపల్లిలోని పొలాల్లో వ్యవసాయ కార్మికులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, కూలీలు సానా సత్యనారాయణ, వెంకటలక్ష్మి, రమణ, సుబ్బలక్ష్మి, సీతమ్మ, మంగ, ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.శ్రీరమణి వ్యకాస క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి ప్రసాద్, మూడే మోజెస్, రైతు సంఘం నాయకులు కడలి సూర్యారావు, బూరాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, మల్లుల గణపతి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక సుందరయ్య భవనంలో వ్యకాస క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కండెల్లి సోమరాజు, మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ, నాయకులు కుప్పా అచ్చాలు, పి.పద్మావతి, వర్రి సత్యనారాయణ, అప్పారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.ఏసు, బి.నాగరాజు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మహిళా వ్యవసాయ కార్మికులు

పిఎఫ్ రుణాలు రాక ఆందోళనలో ఉపాధ్యాయులు

మొగల్తూరు : ఉపాధ్యాయులకు పిఎఫ్ రుణాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంఎస్‌ఆర్‌కె.ప్రసాద్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్ నుండి రుణాలు అందడం లేదని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు గత సంవత్సరం జూన్ నుండి చెల్లింపులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. దీనిపై ఎన్నిసార్లు సంప్రదించినా సంబంధిత అధికారులు లేరని చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రుణాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు



న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)
తిరుపతికి		
ఎయరిండియా	07.55	బుధవారం మినహా
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	10.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే

కోడి గుడ్ల ధరలు



విజయవాడ	రూ. 3.51
హైదరాబాద్	రూ. 3.45
ప.గోదావరి	రూ. 3.51
తూ.గోదావరి	రూ. 3.51
విశాఖ	రూ. 3.60
చిత్తూరు	రూ 3.63
చెన్నై	రూ. 3.70
నామకల్	రూ 3.65



బులియన్ మార్కెట్

24 క్యారెట్లు : 2,986 (గ్రాము) : 29,860 (10గ్రా)

22 క్యారెట్లు :2,798 (గ్రాము) : 27,980 (10గ్రా)

వెండి : 39.27(గ్రాము) : 39,270 (కిలో)

రైల్వే టైమ్‌టేబుల్

ఏలూరు నుంచి

రాజమండ్రి వైపు

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
12728	గోదావరి-హైదరాబాద్-విశాఖ	00.06	00.07
12740	గరీబ్‌రథ్-సికింద్రాబాద్-విశాఖ	02.41	02.42
18048	అమరావతి:వాస్కోడిగామా-హౌరా(సో,బు,శు,శ)	03.46	03.47
12738	గౌతమి-సికింద్రాబాద్-కాకినాడ పోర్ట్	04.06	04.07
17487	తిరుమల-తిరుపతి-విశాఖ	04.21	04.22
18510	ఎక్స్‌ప్రెస్-హెచ్-ఎస్ నాందేడ్-విశాఖ (సో,గు,శు)	04.41	04.42
18310	నాగావళి-నాందేడ్-సంబల్‌పూర్ (మ, బు, ఆది)	04.41	04.42
67300	ప్యాసింజర్-విజయవాడ-రాజమండ్రి	05.48	05.50
12718	రత్నాచల్-విజయవాడ-విశాఖ	06.51	06.52
12840	మెయిల్ -చెన్నయ్-హౌరా	07.26	07.27
18464	ప్రశాంతి-బెంగులూర్-భువనేశ్వర్	07.41	07.42
12862	లింక్-నిజాముద్దీన్-విశాఖ	07.51	07.52
13352	బొకారో-అలెప్పి-టాటానగర్	08.16	08.17
57225	ప్యాసింజర్-విజయవాడ-విశాఖ	09.47	09.48
12864	యశ్వంత్‌పూర్- యశ్వంత్‌పూర్-హౌరా	10.26	10.27
17239	సింహాద్రి-గుంటూరు-విశాఖ	10.34	10.35
22416	ఎపి ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ-విశాఖ	13.31	13.32
57257	ప్యాసింజర్-తిరుపతి-కాకినాడ	13.59	14.00
12806	జన్మభూమి-సికింద్రాబాద్-విశాఖ	14.27	14.28
11019	కోణార్క్-ముంబై-భువనేశ్వర్	15.08	15.09
17205	షిర్డీ- సాయినగర్ షిర్డీ-కాకినాడ టౌన్ (సో,బు,శు)	16.25	16.27
18646	ఈస్ట్‌కోస్ట్-హైదరాబాద్-హౌరా	17.38	17.39
57231	ప్యాసింజర్-విజయవాడ-కాకినాడ పోర్ట్	18.33	18.35
67261	ప్యాసింజర్-విజవాడ-రాజమండ్రి	19.46	19.47
57271	ప్యాసింజర్-విజయవాడ-రాయగడ	22.16	22.17
12704	ఫలక్‌నామా-సికింద్రాబాద్-హౌరా	22.26	22.27
	విజయవాడ వైపు		
12739	గరీబ్‌రథ్-విశాఖ-సికింద్రాబాద్	00.44	00.45
12703	ఫలక్‌నామా-హౌరా-సికింద్రాబాద్	01.39	01.40
11020	కోణార్క్-భువనేశ్వర్-ముంబై	03.06	03.07
22883	పూరీ-పూరీ-యశ్వంత్‌పూర్(శని)	03,34	03.35
67262	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	05.40	05.41
57272	ప్యాసింజర్-రాయగడ-విజయవాడ	07.04	07.05
57232	ప్యాసింజర్-కాకినాడపోర్ట్-విజయవాడ	08.00	08.01
17206	షిర్డీ ఎక్స్‌ప్రెస్-కాకినాడ-షిర్డీ (సో,బు,శని)	08.31	08.32
18645	ఈస్ట్‌కోస్ట్-హౌరా-హైదరాబాద్	09.25	09.26
12805	జన్మభూమి-విశాఖ-సికింద్రాబాద్	10.28	10.29
57258	ప్యాసింజర్-కాకినాడ-తిరుపతి	11.31	11.32
17240	సింహాద్రి-విశాఖ-గుంటూరు	12.08	12.09
22415	ఎక్స్‌ప్రెస్-విశాఖ - న్యూఢిల్లీ	12.26	12.27
13351	బొకారో-టాటానగర్-అలెప్పి	14.36	14.37
12863	హౌరా-హౌరా-యశ్వంత్‌పూర్	15.02	15.03
57226	ప్యాసింజర్-విశాఖప్నటం-విజయవాడ	15.50	15.52
12717	రత్నాచల్-విశాఖ-విజయవాడ	16.51	16.52
18047	అమరావతి-హౌరా-వాస్కోడిగామా(మ,బు,శు,ఆది)	16.58	16.59
18463	ప్రశాంతి-భువనేశ్వర్-బెంగుళూర్	17.31	17.32
17488	తిరుమల-విశాఖ-తిరుపతి	18.41	18.42
12861	లింక్-విశాఖ-నిజాముద్దీన్	19.33	19.34
67229	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	19.45	19.50
12727	గోదావరి-విశాఖ-హైదరాబాద్	22.01	22.02
12737	గౌతమి-కాకినాడపోర్ట్-సికింద్రాబాద్	22.56	22.57
18309	సంబల్‌పూర్-నాందేడ్(సో,మ,ఆది)	23.47	23.48
18509	ఎక్స్‌ప్రెస్-విశాఖ-నాందేడ్(మ,బు,శని)	23.47	23.48

అనాధలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని దారవరం గ్రామంలో ఇంప్రోస్ సోషల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని అనాధలకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఛైర్మన్ జె.సత్యనారాయణమూర్తి, కన్వీనర్ యు.ప్రసాద్, కార్యదర్శి జాన్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదలకు, అనాధలను ఆదుకోవడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. రానున్న రోజుల్లో సంస్థ తరపున మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రజలపై పెనుభారంగా జిఎస్‌టి, నోట్ల రద్దు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నరసింహారావు

ప్రజాశక్తి - ఆకివీడు

జిఎస్‌టి, నోట్ల రద్దు అంశాలు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపాయని సిపిఎం జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు విమర్శించారు. మంగళవారం స్థానిక వెలమ కళ్యాణ మండపంలో సిపిఎం ఆధ్వర్యంలో వస్తు సేవా పన్ను, నోట్ల రద్దు నిర్ణయాలు - ప్రజలు, వ్యాపారస్తులపై వాటి ప్రభావాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆ పార్టీ మండల కార్యదర్శి కె.తవిడినాయుడు అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా విచ్చేసిన నరసింహారావ మాట్లాడుతూ సాధారణ ప్రజానీకంపై జిఎస్‌టితో పన్నుల భారం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మరింత రాయితీ కల్పించిందన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చట్టం అమల్లోకి వచ్చి ఏడాది కావస్తున్నా సరైన నియమ నిబంధనలు లేవన్నారు. జిఎస్‌టి పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేసి పెట్టుబడిదారుల పరం చేస్తోందని విమర్శించారు. ఏటా పది లక్షల మంది ఇంజినీరింగ్ విద్య పూర్తి చేస్తుంటే కేవలం రూ.1.30 లక్షల మందికి మాత్రమే ఉద్యోగాలు దొరుకుతున్నాయని, మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరమే అని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ వస్తువుల దిగుమతి కోసమే ప్రభుత్వం నోట్ల రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సత్యనారాయణ, పార్టీ పట్టణ కార్యదర్శి గేదెల అప్పారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు రాఘవులు, వినియోగదారుల సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, డివిఆర్ మూర్తి మాట్లాడారు.

రెవెన్యూ కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్‌ను బహూకరిస్తున్న కృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం రెవెన్యూ కార్యాలయానికి కలిదిండి మురళీకృష్ణంరాజు సేవా సమితి ఆధ్యరంలో ఆ సంస్థ ఛైర్మన్ కలిదిండి కృష్ణంరాజు రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను మంగళవారం బహూకరించారు. ఈ మేరకు కృష్ణంరాజు స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా విఆర్‌ఒలకు కంప్యూటర్‌ను అందజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు తమ గ్రామంలోని రెవెన్యూ కార్యాలయానికి కంప్యూటర్‌ను బహూకరించినట్లు చెప్పారు. కంప్యూటర్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కటకంశెట్టి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు జడ్డు రామచంద్రరావు, మాజీ అధ్యక్షులు పేరిచర్ల కనకరాజు, శివాలయం ఛైర్మన్ కలిదిండి ఆనందరాజు, పంచాయతీ కార్యదర్శి పద్మాజీరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు పెన్మెత్స ప్రసాద్‌రాజు, గునుపూడి శ్రీనివాసరావు, కాటం శ్రీనివాసు, కొండబాబు, కోళ్ల ముసలయ్య పాల్గొన్నారు.

జాతీయ వైద్యకమిషన్ నిర్ణయాన్ని విరమించుకోవాలి

ప్రజాశక్తి - ఆకివీడు

జాతీయ స్థాయిలో ఐఎంఎ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఆకివీడులో ఆసుపత్రులన్నీ మూతపడ్డాయి. ప్రాణాంతకరమైన పరిస్థితుల్లో ఉన్న రోగులకు తప్ప మరెక్కడా సేవలందించలేదు. ఈ సందర్భంగా స్థానిక ఐఎంఎ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ ఆకివీడు శాఖ వ్యవస్థాపకులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు, సంఘం ప్రస్తుత కార్యదర్శి డాక్టర్ ఎస్‌సి.రామరాజు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తహశీల్దార్ నారాయణ రెడ్డికి వారు అందజేసినట్లు పేర్కొన్నారు.

పాలకొల్లు : పయివేటు ఆసుపత్రులకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐఎంఎ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు పాలకొల్లులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆసుపత్రులను మూసి వేసి బంద్ నిర్వహించారు. కేవలం అత్యవసర పరిస్థితి కేసులకు వైద్యం అందించారు. పాలకొల్లులో ఐఎంఎ అధ్యక్షులు చల్లా బ్రిజ్ మోహన్‌కృష్ణ, కార్యదర్శి ప్రభాకర్, వైద్యులు కెఎస్‌పిఎస్.వర్మ, భూషణ్‌కుమార్, సి.రాఘవులు, ముచ్చర్ల సంజయ్, హేమంత్‌కుమార్, మల్లిఖార్జునశర్మ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు.


తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వైద్యులు

తణుకు రూరల్ : మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను రద్దు చేసి ఆ స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి)ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులైన వైద్యులు మంగళవారం పట్టణంలో ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు మూసేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తణుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.సోమశేఖర్, జెవివిఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌ఎంసిలో పొందుపరిచిన అంశాలు వైద్యుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు.

జంగారెడ్డిగూడెం : వైద్యులపై దాడులను అరికట్టాలని, విధులకు భంగం కలుగకుండా రక్షణ కల్పించాలని వైద్యులు చేపట్టిన బంద్ పాక్షికంగా సాగింది. మంగళవారం స్థానిక వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

ఎంఎల్‌ఎ శివకు రైతుల గోడు

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను స్థానిక ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజుకు వివరించారు. వేంద్ర అగ్రహారంలో జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్తున్న ఎంఎల్‌ఎ శివరామరాజును రైతులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఆయకట్టు ప్రాంతానికి చుక్కనీరు కూడా అందడం లేదని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా సాగు ప్రారంభించి రోజులు గడుస్తున్నా నేటికి తాము సాగు చేపట్టలేదన్నారు. తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ శివ మాట్లాడుతూ ఆయుకట్టు ప్రాంతాన్ని పరిశీలించి సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఎకరానికి పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తామని రైతులు అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులందరూ కృషి చేయాలని స్థానిక ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు కోరారు. పట్టణంలో ఒకటి నుంచి నాలుగు వార్డుల్లో మంగళవారం జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని రహదారులను సీసీ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పూర్తి స్థాయిలో సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పంతం సతీష్, పాలవెల్లి మంగ, యతం నాగలక్ష్మి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, గాదిరాజు సుబ్రమణ్య రాజు పాల్గొన్నారు.

నాణ్యత లేని విత్తనాలను ఎందుకు సిఫార్సు చేశారు..?

వీరవాసరం : మంచి ఫలితాలు ఇవ్వని వరి విత్తనాలను రైతులకు ఏ విధంగా సరఫరా చేశారంటూ భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం అండలూరు, నవుడూరు, నేలపోగుల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ సార్వా సీజన్ వరి పంటకు వాతావరణం అనుకూలించిందని, అయితే 1229 రకంతో రైతులు నష్టపోయారని చెప్పారు. ఈ రకంపై దోమ, తెగుళ్ల ప్రభావం అధికంగా ఉందని రైతు నాయకుడు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రామాంజనేయులు

తమ్మినీడి నాగేశ్వరరావు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. దీనిపై ఎంఎల్‌ఎ అక్కడే ఉన్న వ్యవసాయాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి రకాలను రైతులకు సిఫార్సు చేయొద్దని సూచించారు. తొలుత ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవడమే జన్మభూమి కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. అండలూరులో పూడిక చేసిన నాలుగు ఎకరాల ఇందిరమ్మ స్థలాన్ని త్వరలోనే 171 మంది లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు), ఎంపిడిఒ పి.జగదాంబ, తహశీల్దార్ ఎం.ముక్కంటి, పిఆర్ ఎఇ సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కోడి పార్వతి, ఎల్‌వి.సత్యనారాయణ, మన్నె శ్రీను, రాయపల్లి వెంకట్ పాల్గొన్నారు.

జిఎన్‌వి కెనాల్‌పై వంతెన నిర్మాణానికి కృషి

పాలకోడేరు : జిఎన్‌వి కెనాల్‌పై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని స్థానిక ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కొండేపూడి, వేంద్ర అగ్రహారం గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా మంజూరైన పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ శివరామరాజు మాట్లాడుతూ కొండేపూడిలో శ్మశానానికి వెళ్లే క్రమంలో జిఎన్‌వి కెనాల్‌ను దాటాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. వంతెన నిర్మాణానికి యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుని ఏడాది కాలంలో పూర్తి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జన్మభూమి అధికారి బిఎల్‌వి ప్రసాద్ పర్యవేక్షించగా ఎంపిపి కునాధరాజు కృష్ణకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు నేతల బేబి, సర్పంచ్‌లు బొక్కా రాంబాబు, పాలా దుర్గ, పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తపల్లి గోపాలకృష్ణంరాజు, ఎంపిడిఒ పి.వెంకటరత్నం, తహశీల్దార్ జి.రత్నమణి పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని ఆరేడు, కలిగూడ్ల గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు ఆయా గ్రామ సర్పంచ్‌లు సిహెచ్.సత్యవతి, పి.పోలేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మాట్లాడుతూ కలిగూడ్ల గ్రామస్తులకు, రైతులకు చిరకాల స్వప్నంగా ఉన్న వెంకయ్య వయ్యూరి కాలువపై వంతెన నిర్మిస్తామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, ఈ నెల తొమ్మిదో తేదీన శంకుస్థాపన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు, ఎంపిపి దాలియ లక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కె.వెంకట సత్యతులసి, ఎంఇఒ సూర్యనారాయణ మూర్తి, ఎంఆర్‌ఒ దుర్గా కిషోర్, ఎంపిడిఒ రెడ్డియ్య పాల్గొన్నారు.

దంతాల పరిరక్షణకు ఆహారపు అలవాట్లే ప్రధానం

ప్రజాశక్తి - నిడదవోలు

దంతాల పరిరక్షణకు ఆహారపు అలవాట్లే ప్రధానమని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ప్రెసిడెంట్ కూచుపూడి వీర వెంకట రామారావు అన్నారు. మంగళవారం తిమ్మరాజుపాలెంలోని మండల పరిషత్ పాఠశాలలో జాతీయ సేవా పథకం, రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భీమవారం దంత వైద్య శిబిరాన్ని రోటిరియా ప్రత్తిపాటి త్రిమూర్తులు చేతుల మీదుగా ప్రారంభించారు. త్రిమూర్తులు సౌజన్యంతో 250 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమోహన్, అధికారి ఎ.మురళీకృష్ణ, రోటరీ జిల్లా సెక్రటరీ గాలి రాఘవయ్య, ముళ్లపూడి వెంకట్రావు, సెక్రటరీ విడి.గంగాధర్ రావు, ట్రెజరర్ చింతా కిషోర్, బండి వేణుగోపాల్ కృష్ణ, కె.మోహన్‌బాబు, దాపర్తి శివ రామకృష్ణ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు యువకుల చేరిక

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మంగళవారం సీనియర్ టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు సమక్షంలో వైసిపికి చెందిన సుమారు 100 మంది యువకులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని సామాజిక వర్గాల యువకుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, దీంతో యువత టిడిపి వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు.

ప్రజాశక్తి
పశ్చిమ గోదావరి
బుధవారం 3
జనవరి 2018



మిర్చి.. రైతును మాడ్చి..!

ధరలేక నష్టాల ఊబిలో మిర్చి రైతులు

ప్రజాశక్తి - లింగపాలెం

మెట్టప్రాంతాల్లో మిర్చి రైతులు నష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, తెగుళ్ల సోకి పంట దెబ్బతినడంతో రైతన్నలు దిగాలు పడుతున్నారు. రైతులకు, వ్యాపారులకు మధ్య నేరుగా సంబంధాలు లేకపోవడం, దళారులపై ఆధారపడడంతో మిర్చి రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. జిల్లాలో పచ్చిమిర్చి పండించడంలో లింగపాలెం మండలం ప్రసిద్ధి. ఈ మండలాన్ని కేంద్రంగా చేసుకొని పరిసర ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల్లో రైతులు మిర్చి పండిస్తున్నారు. ఈ పంటనే నమ్ముకున్న రైతులు గిట్టుబాటు ధర లేక దిగాలు చెందుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో డిమాండ్..

ఇక్కడ పండించిన మిర్చికి ముంబాయి, బెంగుళూరు, రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది అస్సాం రాష్ట్రం నుంచి వ్యాపారులు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. ఇంత డిమాండ్ ఉన్నా రైతులకు గిట్టుబాటు ధర లేదు. మిర్చి సీజన్ డిసెంబర్‌లో ప్రారంభమై ఏప్రిల్ వరకూ సాగుతుంది. లింగపాలెంను కేంద్రంగా చేసుకుని ఇక్కడి నుంచి రోజూ200 టన్నులు ముంబాయి, బెంగుళూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. పదేళ్ల వెనక్కి వెళితే అప్పట్లో ఈ పంట వల్ల రైతులు లాభాలను చవిచూశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ఈ పంటను పండిస్తున్నారు. అప్పటిలా అనుకూలమైన పరిస్థితులు నేడు లేవు.

పెట్టుబడులు అధికం..



వడ్లాని సురేంద్ర, రైతు కొత్తపల్లి

ఎకరం పంట పండించడానికి రూ.లక్ష నుంచి రూ.లక్షా పాతిక వేలు పెటుబడి పెటాల్సి వస్తుంది. ఈ పంటను బోర్ల ఆధారంతోనే పండిస్తున్నాం. మెట్ట ప్రాంతం కావడంతో నీటి వనరులు లేవు. బోర్లు అడుగంటడంతో సక్రమంగా పంటకు నీరు అందడం లేదు. అలాగే తెగుళ్ల సోకుతున్నాయి. ఎకరానికి 150 నుంచి 200 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర రావడం లేదు. బస్తా దిగుబడి రావాలంటే వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది. ధర ఎప్పుడు ఎలా ఉంటుందో శాసించేది దళారులే. రైతులకు వ్యాపారులతో నేరుగా సంబంధాలు లేవు.

గిట్టుబాటు ధర కల్పించాలి..



కోడూరి యోహాన్ రైతు

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ముందుముందు మిర్చి పండించే ఈ ప్రాంతంలో ఉండరు. నష్టాలను భరించలేక ఉన్న భూములను అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

పొగ.. పర్యావరణానికి సెగ



రహదారి పక్కనే చెత్త తగులబెట్టడంతో పొగతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - పోడూరు

స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ అంటూ గొప్పలు చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం శూన్యం అనే చెప్పాలి. మండలంలోని పండితవిల్లూరు, ఆచంట - మార్టేరు వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి పక్కనే చెత్తను తగులబెట్టి పర్యావరణానికి విఘాతం కల్పించడంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. పచ్చదనం - పరిశుభ్రత అనే అంశంపై పలు కార్యక్రమాలు ప్రవేశపెట్టి ఊరికి దూరంగా డంపింగ్‌యార్డులను నిర్మించి వాటి నుండి చెత్తను వేరు చేసి, పార్కులుగా నియమించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు చేస్తున్న పనులు మాత్రం విఫలమయ్యాయి. దీంతో చెత్త కుప్పలను శ్మశాన వాటికల్లో, రోడ్ల పక్కన వేయడంతో పర్యావరణం కాలుష్యం కావడమే కాక అవి కుళ్లి దుర్వాసన వెదజల్లి ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు ఎక్కడికక్కడ టైర్లు, పొలంలో వదిలేసిన గడ్డిని తగులబెతున్నారు. దీంతో కార్బన్‌డైయాక్సైడ్ వంటి వాయువులు విడుదలై శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా చెత్తను రహదారులకు దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అదరగొడుతున్నాడు..

వెయ్యి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుందనేది నానుడి. అయితే దాన్ని నిజం చేస్తూ చిన్న వయస్సులోనే పలు విజయాలు సాధిస్తూ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటుతూ చింతలపూడి మండలానికి పేరు ప్రఖ్యాతలు తెస్తున్నాడు. ఎంతోమంది చదువుకో, ఒక క్రీడకో పరిమితం అవుతున్న నేటి రోజుల్లో కంపసాటి ధనుష్ హ్యాండ్‌బాల్, డిస్కత్రోయింగ్, షాట్‌పుట్‌త్రో లో జాతీయస్థాయిలో అదరగొడుతున్నాడు. చదువులో గ్రేడ్ ఏమాత్రమూ తగ్గకుండా బేలెన్స్ చేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

క్రీడల్లో సత్తాచాటుతున్న ధనుష్ - జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పతకాలు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో ధనుష్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పట్టణం మోడల్‌కాలనీకి చెందిన కంపసాటి సత్యనారాయణ పార్వతి దంపతుల కుమారుడు ధనుష్‌బాబు. ధనుష్ తాడేపల్లిగూడెంలోని భారతి విద్యా భవన్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వీరిది సామాన్య కుటుంబం. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి గృహిణి, ఇద్దరు అక్కలు వారు కూడా అటు చదువులో ఇటు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ధనుష్ ఐదో తరగతి చదువుతున్నప్పుడు హ్యాండ్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నాడు. తల్లిదండ్రులు, గురువు భాస్కర్ ప్రోత్సాహంతో క్రీడల్లో శిక్షణ తీసుకుంటూ విజయాలు సాధిస్తున్నాడు.

క్రీడలు..

మండలస్థాయిలో పోటీల్లో..

- 2016లో జరిగిన మండల స్థాయి పోటీల్లో షాట్‌పుట్‌త్రోలో ప్రథమ స్థాం. అదే సంవత్సరం డిస్కత్రోయింగ్‌లో ద్వితీయ స్థానం సాధించాడు.
- 2017లో మండల స్థాయి స్కూల్ పోటీలో హైజంప్‌లో ద్వితీయ, డిస్కర్స్‌త్రోలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. చింతలపూడి సిఐ పి.రాజేష్ చేతులమీదుగా బహుమతి పొందాడు.
- 2015లో గోపన్నపాలెంలో జరిగిన పరుగుపందెం పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి ధనుష్ ఎంపికయ్యాడు.

జిల్లాస్థాయి పోటీల్లో..

- 2016లో గోపన్నపాలెంలో మూడురోజుల పాటు జరిగిన అండర్ 15 ఖేల్ ఇండియా పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. 2016 తణుకులో జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 16 డిస్కత్రోయింగ్‌లో ప్రథమస్థానం సాధించి బంగారు పతకం సాధించాడు.
- 2016లో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లాలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధించాడు.
- 2016లో గోపన్నపాలెంలో జరిగిన అథ్లెటిక్స్ ఒలింపియాడ్ పోటీల్లో డిస్కత్రోయింగ్‌లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు.

రాష్ట్ర స్థాయిలో పోటీలు

- 2015 సౌత్‌జోన్ సెంటర్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యూకేషన్ ఢిల్లీ వారు తునిలో నిర్వహించిన ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్స్ అండర్ 14 హ్యాండ్‌బాల్ పోటీల్లో సిల్వర్ సాధించాడు.
- 2016 గుంటూరులో జరిగిన అథ్లెటిక్స్ టోర్నీ (గేమ్స్ ఫెడరేషన్ ఎపి) డిస్కత్రోయింగ్‌లో సిల్వర్ పతకం సాధించాడు.
- 2016 -17లో గేమ్స్ ఫెడరేషన్ ఎపి తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్స్ కాపింటేషన్‌లో సిల్వర్ పతకం సాధించాడు. 2017 తాడేపల్లిగూడెంలో జరిగిన గేమ్స్ ఫెడరేషన్ ఎపి ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్ గేమ్స్‌లో డిస్కత్రోయింగ్‌లో సిల్వర్ సాధించారు.
- 2016లో వైజాగ్‌లో జరిగిన అథ్లెటిక్స్ టోర్నీ పోటీల్లో అండర్ 17 పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు.
- 2017లో బెంగుళూర్‌లో జరిగిన ఇంటర్ స్కూల్స్ గేమ్స్ కాపింటేషన్‌లో హ్యాండ్‌బాల్‌లో సిల్వర్ పతకం సాధించాడు. 6.2017 జి.కొండూరులో అండర్ 16 విభాగంలో ఎపి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు.

జాతీయ స్థాయిలో పాల్గొన్న పోటీలు

2015 ఢిల్లీలో ఐదు నుంచి 10 వరకూ జరిగిన ఢిల్లీ సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ స్కూల్ ఎడ్యూకేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్స్ కాపింటేషన్‌లో, డెహారాడూన్‌లో జరిగిన హ్యాండ్‌బాల్ విభాగంలో మూడో స్థానం నిలిచి బ్రౌన్ మెడల్ సాధించాడు. 2016 గుజరాత్‌లో నవంబరులో జరిగిన ఢిల్లీ సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యూకేషన్ వారు నిర్వహించిన పోటీల్లో డిస్కత్రోయింగ్‌లో మూడో స్థానంలో నిలిచి బ్రౌన్ మెడల్ సాధించాడు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ధనుష్

జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించాలి



కంపసాటి ధనుష్
9వ తరగతి, చింతలపూడి మోడల్‌కాలనీ

2018లో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాలి. భవిష్యత్‌లో ఐపిఎస్ కావాలన్నదే నా తల్లిదండ్రుల కోరిక. వారి కల నిజం చేయటానికి కష్టపడతాను. 2018లో జాతీయస్థాయి పోటీలకు గురువు భాస్కర్ వద్ద తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షణ తీసుకుంటాను.

ఆశలన్నీ వాడిపైనే..



కంపసాటి సత్యనారాయణ పార్వతి, ధనుష్ తల్లిదండ్రులు

మా ఆశలన్నీ కొడుకు మీదే. భవిష్యత్‌లో మరింత ఎదగడం కోసం కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం. ఐపిఎస్ చదివించాలన్నదే మా కల. మా అబ్బాయి క్రీడల్లో ప్రతిభ చూసి తాడేపల్లిగూడెం భారతీ విద్యాభవన్ స్కూల్ వారు ఫీజు లేకుండా ఉచితంగా చదువు, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

కష్టపడితేనే.. వేతనం..

జీడిపప్పు పరిశ్రమతో ఉపాధి - పలాస నుంచి వలస వచ్చిన కార్మికులు



జీడి పప్పును గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని దేవరపల్లిలో 15 సంవత్సరాల క్రితం జీడి పప్పు పరిశ్రమను స్థాపించారు. అప్పటి నుంచి ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమలో సుమారు వంద మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి వలస వచ్చారు. ఈ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యం వసతి, వైద్యం కల్పిస్తోంది. అయితే కార్మిక చట్టాలు మాత్రం అమలు చేయడం లేదు. వారికి పని గంటలతో సంబంధం లేకుండా ఉదయం నుండి సాయంత్రం వరకూ పని చేయించుకుంటున్నారు. కిలో జీడిపప్పు రూ.20 చెల్లిస్తారు. భార్యాభర్తలు ఇద్దరు కష్టపడితే రోజుకు రూ.400 సంపాదిస్తారు. ఈ చాలీచాలని వేతనాలతో కష్టపడి పని చేస్తున్నారు.



గ్రేడింగ్ చేస్తున్న కార్మికుడు

ఐదేళ్లుగా పని చేస్తున్నాను..

ఎ.సంతోష్, కార్మికుడు

ఐదు సంవత్సరాల నుంచి జీడిపప్పు పరిశ్రమలో పని చేస్తున్నాను. కిలో పప్పు తయారు చేస్తే రూ.20 ఇస్తారు. భార్యాభర్తలు కలిసి పనిచేస్తే రోజుకు రూ.400 వరకూ వస్తుంది.

కష్టమైనా అలవాటైంది..

చింత రామారావు, కార్మికుడు

శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్నాను. రోజుకు 25 కేజీల జీడిపప్పు కటింగ్ చేస్తాను. ఈ పని కష్టమైనా అలవాటైన పని కాబట్టి పని చేస్తున్నాను. యజమానులు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

శ్రీకాకుళం నుంచి వలస వచ్చాను

మైనపల్లి కృష్ణవేణి, కార్మికురాలు

శ్రీకాకుళం జిల్లా నుండి వచ్చి ఇక్కడ పని చేస్తున్నాను. నేను జీడి గింజలను బాయిలింగ్ చేస్తాను. నాకు నెలకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు.



జీడి గింజల నుండి పప్పును వేరు చేస్తున్న మహిళ



సైకిల్ తొక్కేద్దాం..

సైకిల్ తొక్కితే ఆరోగ్యం...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఇంతక ముందు ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కేవారు. సైకిల్ లేని ఇల్లు ఉండేది కాదు. ఇంటి అవసరాలకు, ఉద్యోగాలకు వెళ్లేటప్పుడు సైకిల్‌ను ఉపయోగించేవారు. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సైకిల్ వాడేవారే కనిపించడం లేదు. మోటార్ సైకిళ్లు వాడకంలోకి వచ్చినప్పటి నుంచి పూర్తిగా సైకిల్ వినియోగించడం మానేశారు. దీంతో అనేక మంది అనారోగ్యాలకు గురవుతున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. సైకిల్ తొక్కడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

శరీరానికి, మనసుకు ఆహ్లాదాన్ని ఇచ్చేది సైకిల్. చిన్నా పెద్దా అందరూ సులువుగా చేయగలిగే వ్యాయమం ఇది. ప్రతి రోజూ అరగంట సైకిల్ తొక్కడం వల్ల శరీర బరువును గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఒత్తిళ్ల అధిగమించి హాయిగా పడుకోవచ్చు. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అంతేగాక రోగాలు కూడా దరి చేరవు. కండరాలు బలంగా ఉండేలా చేస్తుందని కొన్ని పరిశోధనలు తెలుపుతున్నాయి. సైకిల్ తొక్కడం వల్ల ఎముకలు ధృడంగా తయారై కీళ్ల నొప్పులు దరి చేరవని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు పెట్రోల్ ఖర్చు, ప్రమాదాలు కూడా తగ్గించవచ్చు. పర్యావరణాన్ని కూడా కాపాడవచ్చు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం మీ సొంతం

డాక్టర్ శివప్రసాద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

సైక్లింగ్ చేయడం వల్ల మజిల్స్ యాక్టివ్ అవుతాయి. శరీరం దృఢంగా మారుతుంది. దీంతో జబ్బులను అరికట్టే శక్తి పెరుగుతుంది. ఊబకాయం, సుగర్, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు దరిచేరవు. రోజుకు 30 నిమిషాల పాటు సైకిల్ తొక్కడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

ముందుగొయ్యి.. ప్రమాదమోయి..!

గణపవరం, తాడేపల్లిగూడెం రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇటీవల ఆర్ అండ్ బి శాఖ వారు గోతులను తూతూమంత్రంగా పూడ్చి చేతులు దులుపుకున్నారు. అయితే రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గొయ్యిని మాత్రం అలాగే వదిలేశారు. సమస్యను పరిష్కరించాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపమే దీనికి కారణం.


గణపవరం, తాడేపల్లిగూడెం రోడ్డులో కొద్ది కాలంగా పెద్ద గొయ్యి దర్శనమిస్తోంది. ఈ గొయ్యి మరెక్కడోకాదు ఆర్ అండ్ బి శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. అంతేకాకుండా ఈ గొయ్యి గణపవరం, జెడ్‌పి బాలుర హైస్కూల్ గేటు ఎదురుగా ఏర్పడింది. హైస్కూల్లో సుమారు 800 మందిపైగా విద్యార్థులు చదవుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా కొత్తగా వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గోతిని ఆర్ అండ్ బి శాఖ అధికార్లు పూడ్చినా నీరు కింద నుంచి ఉబికి వస్తుండడంతో మరలా పెద్ద గొయ్యిగా మారుతోంది. ఇటీవల పిప్పర తాడేపల్లిగూడెం రోడ్డు, గణపవరం, కవలపూడి రోడ్డు, ఏలూరు రోడ్డు, అడవికొలను నిడమర్రు రోడ్డు, పడమర విప్పర్రు రోడ్లను లక్షల రూపాయల వ్యయంతో మరమ్మతులు చేశారు. ఈ నేపథ్యంలో ఈ గోతిని పూడ్చి పైన తారు వేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో పడిన గొయ్యి

ప్రజాశక్తి పరిశీలన 1

గోతిని పూడ్చాలి..



ఎం.ఆంజనేయులు, సిపిఎం ఏరియా కమిటీ, గణపవరం

రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యిని వెంటనే పూడ్చాలి. ఈ గొయ్యి వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న సమస్యను కూడా సాగదీయడం సబబుగా లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో కాకుండా పరస్పర సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

గొయ్యిని చాలాసార్లు పూడ్చాం



ప్రసాద్‌రాజు, ఆర్ అండ్ బి జెఇ, గణపవరం

రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యిని చాలా సార్లు పూడ్చాం. రోడ్డు కింద ఉన్న తాగునీటి కుళాయి గొట్టం పగిలిపోయి నీరు పైకి వస్తోంది. దీనివల్ల గొయ్యి ఏర్పడుతోంది. మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం ఉండటం లేదు.

అధికారులు సంసిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా భూగర్భ జల శాఖ ఎడి ఎస్.రంగారావు అన్నారు. బుధవారం నుండి మండలంలో చేపట్టనున్న జన్మభూమి మాఊరు కార్యక్రమ నిర్వహణపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమాయత్త సమావేశాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ కార్డులను అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎంపిడిఒ రేణుకమ్మ, తహశీల్దారు వైకెవి.అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని కొత్త ఉంగుటూరులోని ఆంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆత్మకూరి రామారావు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు, ఆ పార్టీ మండల అధ్యక్షులు మరడ మంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాల నెంబర్-1 విద్యార్థులకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వార్డు సభ్యులు వానపల్లి సత్య వరప్రసాద్ మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కోరారు. ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 నుంచి జాతీయస్థాయి పాల పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి జాతీయస్థాయి గోవుల, ఎడ్ల పోటీలను మూడు రోజుల పాటు పెదతాడేపల్లిలోని భారతీ విద్యా భవన్‌లో నిర్వహిస్తున్నట్లు దేశీయ గోజాతి పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీరంగనాథరాజు వెల్లడించారు. పెదతాడేపల్లిలోని భారతీవిద్యా భవన్‌లో ఐదో జాతీయ ఆవుల, గేదెల, ఎడ్ల బల ప్రదర్శన, పాల పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాల పోటీలను మూడు కేటగిరీలుగా నిర్వహిస్తామని, ఒంగోలు, ముర్రా జాతి ఎద్దుల పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని, వీటిలో బండలు లాగే వాటిలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా నిర్వహిస్తామని వివరించారు. ఆవుల పాల పోటీల్లో ఒంగోలు, కంక్రేజ్, గిర్ వంటి జాతి ఆవుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. పదో తేదీన విజేతలకు బహుమతీ ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రా పిండి వంటలతో పాటూ సనాతన కళారూపాలైన తోలుబొమ్మలాట, తదితర కళల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు యాదగిరి నారాయణరావు, సంఘం నాయకులు కొప్పాక వెంకటనారాయణరాజు, డి.రంగరాజు, కె.శ్రీనివాస్, సిహెచ్.వెంకట్రావు, కె.కుమార వర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరంగనాథరాజు

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా నాయకులు కేతా గోపాలన్



ర్యాలీలో మాట్లాడుతున్న కేతా గోపాలన్

ప్రజాశక్తి - తణుకు రూరల్

బ్యాంకుల్లో ప్రజలు దాచుకునే సొమ్ముకు రక్షణ లేకుండా చేసే ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ప్రతిఒక్కరూ ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు వచ్చే నెల 10, 11, 12 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్న సందర్భంగా అత్తిలిలో 25 సిపిఎం పతాకాలను, 25 మీటర్ల ఎర్రజెండాతో ప్రచార ర్యాలీని మండల కార్యదర్శి నీతిపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, పివి.ప్రతాప్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకొచ్చిన తర్వాత పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టితో నూటికి 80 శాతం మంది ప్రజలపై భారం పెరిగి, 20 శాతం కార్పొరేటు సంస్థలు లాభాల బాట పట్టాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబుకు భూదాహం పట్టిందన్నారు. పేదల చేతిలో వేలాది ఎకరాల భూములను లాక్కొని పెద్దలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు వేదిక భీమవరం కాబోతుందన్నారు. వచ్చే నెల పదో తేదీన జరిగే ప్రదర్శనకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి, బివి.రాఘవులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, బళ్ల చినవీరభద్రం, పి.దక్షిణామూర్తి, బత్తుల విజయకుమార్, బాలం సత్యనారాయణ, చిట్టూరి నాగరాజు, రాజబాబు, ధర్మయ్య, దానం పెద్దిరాజు, దాయం వెంకన్న, పిప్పర్తి మహాలక్ష్మి పాల్గొన్నారు.

కానరాని స్వచ్ఛభారత్..!

లోపించిన పారిశుధ్యం పందుల స్వైరవిహారం



చెత్తలో తిరుగుతున్న పందులు

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలో పారిశుధ్యం లోపించడంతో వీధులన్నీ మురికికూపాలను తలపిస్తున్నాయి. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఆ మురికిలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో విషజ్వరాలు వ్యాపిస్తాయేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్వచ్ఛభారత్ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ప్రసంగాలు ఇవ్వడం మినహా క్షేత్రస్థాయిలో లక్ష్యానికి అనుగుణంగా పారిశుధ్య నిర్వహణకు చేపట్టిన చర్యలు శూన్యమనడంలో సందేహమే లేదని పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రచారార్భాటాలకు రూ.కోట్లు కుమ్మరిస్తున్న ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది, పనిముట్లు, పర్యవేక్షణ వంటి విషయాల్లో విఫలమైందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు ప్రధాన రహదారులపై చేరుతోంది. దీంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమలు విజృంభించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నెలలో రెండుసార్లు దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ సంవత్సరం మొత్తంలో ఒక్కసారి కూడా ఆ దిశగా ప్రయత్నమే చేయడం లేదని వాపోతున్నారు. మురికి కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని, అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా వృద్ధులకు దుస్తులను అందించడం ఆదర్శప్రాయమైన సమాజ సేవ అని వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు అన్నారు. కైకరంలో సోమవారం రాత్రి ఆ పార్టీ కార్యకర్తల సహకారంతో ఏర్పాటు చేసిన వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసుబాబు మాట్లాడుతూ పేదలను, అనాథలను ఆదుకోవడంలో నిజమైన సంతృప్తి ఉందన్నారు. ప్రతిఒక్కరూ సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మరడ మంగారావు, నాయకులు పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీనివాసరావు, పెద్ద అప్పన్న, మట్టా మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జన్మభూమి - మాఊరు'



మాట్లాడుతున్న బాపిరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

నందమూరు గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. మంగళవారం నందమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జన్మభూమి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాపిరాజు మాట్లాడుతూ గృహాలు లేని వారు దరఖాస్తులు పెట్టుకుంటే ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చంద్రన్న కానుకలు అందచేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఒ పి.నాగమణి, ఎంపిపి గన్నమని దొరబాబు, ఎంపిటిసి సభ్యులు కృష్ణ, శనగన శ్రీనివాసరావు, జగన్నాథపురం సర్పంచ్ ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమడోలు : సమస్యల పరిష్కార వేదికగా జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు కోరారు. మండలంలోని భీమడోలు, పూళ్ల పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌లు పి.శిరీష యుగంధర్, ఎన్.సుజాత శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పాల్గొనగా నియోజకవర్గ సమన్వయకర్త, కార్మిక శాఖ కమిషనర్ బి.వరప్రసాద్, మండల ప్రత్యేక అధికారి గృహనిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ, అధికారులు ప్రజలతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అతిథులు, అధికారులతో పాటూ జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, సర్పంచ్‌లు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు, రేషన్ కార్డులు, ఐకెపి పథకాల లబ్ధి అందచేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా నవీన్, ఎంపిపి రామతులసమ్మ, ఎంపిటిసి సభ్యులు శేషగిరి, వైస్ ఎంపిపి ఎన్‌వి.సత్యనారాయణ, ఆర్‌డిఒ.చక్రధరరావు, ఇఒఆర్‌డి భీమేష్, వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పూళ్లలో..

పూళ్ల జన్మభూమి కార్యక్రమంలో భాగంగా సంక్షేమ శాఖ సంతృప్తి దివస్‌ను మంగళవారం నిర్వహించారు. పూళ్ల జన్మభూమి కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు తీసుకొన్న స్థానిక తహశీల్దార్ ఎం.గంగరాజు ఆధ్వర్యంలో పూళ్ల హైస్కూల్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యా శాఖ మండల సమన్వయ కర్త ఎం.సెరీన్ ప్రదర్శించిన తోలుబొమ్మలాట పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులకు నిర్వహించిన ముగ్గులు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం ఉంటుందని తహశీల్దార్ తెలిపారు. బ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమారి, ఎం.సుధాకర్, పరశురాం, గిరిధర్‌తో పాటూ ఇఒఆర్‌టి భీమేష్ పాల్గొన్నారు.

నిడమర్రు : గ్రామ సమస్యల పరిష్కారానికి జన్మభూమి వేదిక అని ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. మంగళవారం జన్మభూమి మాఊరు ప్రారంభం సందర్భంగా గణపవరం, మండలపర్రు గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సభలకి ఆయా గ్రామ సర్పంచ్‌లు కొత్తూరు సుధా, జలస్తత్రం పెద్దులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గన్ని మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్యను రెండు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ దామోదరరావు, ఎంఇఒ నరసింహమూర్తి, మండల జెఇ రాంబాబు, ఆర్‌డబ్ల్యు జెఇ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

గణపవరం : పేదల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ఉంగుటూరు ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. మండలంలో మంగళవారం నుంచి ప్రారంభమైన ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరదరాజపురం, ఎ.గోపవరం, ముగ్గళ్లలో ఏర్పాటు చేసిన జన్మభూమి సభల్లో ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఒ మధుసూదనరావు, ఎంపిడిఒ జి.పద్మ, ఎంఇఒ పి.శేషు, ఎఒ పార్థసారధి, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ కార్మికులకు తక్షణమే గుర్తింపు కార్డులను ఇవ్వాలని సిఐటియు డివిజన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆ యూనియన్ డివిజన్ కమిటీ సమావేశం వి.నర్సింహమూర్తి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడుతూ కొవ్వూరు అసిస్టెంట్ కమిషనర్ లేబర్ కార్యాలయం పరిధిలో కొన్ని నెలలుగా కార్మిక శాఖలో సభ్యత్వం నమోదు చేసుకొన్న నిర్మాణ కార్మికులకు కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం, కార్యనిర్వాహక శాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటివరకూ కార్మికులకు గుర్తింపు కార్డులను అందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన కార్డులను అందజేయాలని కోరారు. సమావేశంలో డి.రాధాకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, డి.దుర్గారావు, ఎం.వీరబాబు, డి.రవి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్రాంతి పేరుతో జూదాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సంక్రాంతి పేరుతో కోడిపందేలు, పేకాట వంటి జూదాల శిబిరాలను నిర్వహించిన వారిపై, అలాగే జూదాల్లో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జన్మభూమి గ్రామ సభలో ఎస్ఐ అశోక్‌కుమార్ కోడి పందేల నిర్వాహకులను పరోక్షంగా హెచ్చరించారు. పండుగల సందర్భంగా జూదాలపై మక్కువ చూపకుండా కుటుంబంతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు.

టిడిపి గ్రూపు విభేదాలపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఫేస్‌బుక్‌లోనూ, వివిధ టివి ఛానళ్లలోనూ ప్రచారమవుతున్న కథనాలపై ఆ పార్టీ నాయకులు, ప్రజల్లో సర్వత్రా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. రాష్ట్ర విభజనానంతరం టిడిపి అధికారం చేపట్టిన సమయంలో నియోజకవర్గస్థాయిలో ప్రారంభమైన గ్రూపు విభేదాలు తాత్కాలికంగా సద్దుమనిగినప్పటికీ క్రమక్రమంగా తారాస్థాయికి చేరుకోవడంతో చివరకు ఏ పరిణామాలకు దారితీస్తుందోనని చర్చ నడుస్తోంది. నియోజకవర్గ స్థాయిలో జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన చాగల్లు జెడ్‌పిటిసి సభ్యులైన అల్లూరి విక్రమాదిత్యల మధ్య కొంత కాలంగా జరుగుతున్న విభేదాల విషయం అధికార పార్టీలో రాష్ట్ర నాయకత్వానికి కూడా చేరినట్లు తెలిసింది. జెడ్‌పిటిసి ఎన్నికలు జరిగినప్పటి నుండి రాజుకొంటున్న ఈ అంతర్గత పోరు విషయం ఫేస్‌బుక్‌లో గతంలో కామెంట్లు చేసే స్థాయి వరకూ చేరింది. ఆ నేపథ్యంలో అల్లూరి విక్రమాదిత్య గ్రూపుగా ఉన్న కాకర్ల సత్యేంద్రపై గతంలో కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో విక్రమాదిత్య ఆగ్రహించిన పిదప తాత్కాలికంగా ఆ సమస్య సద్దుమణిగింది. తిరిగి సోమవారం రాత్రి మంత్రి కాకర్ల సత్యేంద్రపై చేయి చేసుకొన్నారన్న వార్త మండలంలో గుప్పుమంది. దీంతో అన్నదేవరపేట గ్రామం నుండి కాకర్ల సత్యేంద్రకు ఆ గ్రామ ఉప సర్పంచి గణపతికి మద్దతుగా పలువురు కొవ్వూరు బయలుదేరి వెళ్లారు. ఇదిలా ఉంటే తెలుగుదేశం పార్టీ ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించిన సమయంలో అన్నదేవరపేట గ్రామంలోనూ అనంతరం చింతలపూడి భూసేకరణ సమయంలోనూ పోచవరం రైతులకు విక్రమాదిత్య మద్దతు పలకడంతో జొన్నలగడ్డపై విక్రమాదిత్య చేసిన వ్యాఖ్యలతో ఈ అంతర్గత పోరు చిలికి చిలికి గాలివానగా మారింది. నియోజక వర్గ స్థాయిలో సాగుతున్న ఈ అంతర్గత పోరుపై అధిష్టానం అసహనాన్ని ప్రదర్శిస్తూ మంత్రి జవహర్‌తో కలిసి మెలిసి ఉండాలని హితవు పలికినట్లు తెలుస్తోంది. పార్టీలో నివురుగప్పిన నిప్పుల పరిణామాలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో రాష్ట్ర మంత్రి తనను కొట్టారంటూ అన్నదేవరపేట గ్రామానికి చెందిన కాకర్ల సత్యేంద్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం టిడిపిలో చర్చనీయాంశమైంది. విభేదాలు ఎలా ఉన్నా పార్టీ పరువును మాత్రం వీధిపాలు చేస్తున్నారంటూ నాయకులు వాపోతున్నారు.



క్రీడాకారులతో లయన్స్ బృందం

లయన్స్ ఆధ్వర్యాన క్రీడాదుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం జెడ్‌పి హైస్కూల్‌లోని 53 మంది క్రీడాకారులకు నిడదవోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మట్టపర్తి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, సామగ్రి అందజేశారు. క్రీడాకారులకు చేయూత నివ్వాలనే ఉద్దేశంతో గారపాటి ప్రసాద్, గారపాటి బాబూరావుల ఆర్థిక సహకారంతో దుస్తులను అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ మున్నా, వెంకటేశ్వరరావు, అల్లూరి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు ఎ.చంద్రశేఖర్, పాఠశాల అభివృద్ధి అధ్యక్షులు గారపాటి కాశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామకంఠంలో ఇంటి పట్టా మంజూరుపై

రెవెన్యూ శాఖకు కోర్టు అక్షింతలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

గృహాన్ని నిర్మించుకుంటున్న ఒక కుటుంబానికి పంచాయతీతో సంబంధం లేకుండా గ్రామకంఠంలో రెవెన్యూ శాఖ ఇంటి పట్టాను జారీ చేసిన కారణంగా హైకోర్టు ఆ శాఖకు అక్షింతలు వేసింది. మండలంలోని తాడిపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచి గంటా కృష్ణ తెలిపిన వివరాల మేరకు గ్రామంలో రెండు వైపుల నుండి మురుగు నీరు వెళ్లే పోరంబోకు స్థలాన్ని అదే గ్రామానికి చెందిన చింతలపల్లి పద్మావతి అనే మహిళకు ఒకసారి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ను మరోసారి ఇంటి పట్టాను తాళ్లపూడి రెవెన్యూ శాఖ అందజేసింది. దీంతో గ్రామ పంచాయతీని సంప్రదించకుండా రెవెన్యూ శాఖ లబ్ధిదారునికి స్థలాన్ని ఇవ్వడంపై అభ్యంతరం తెలియజేసినా ఆ శాఖ పట్టించుకోకపోగా, ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కూడా అనుమతి ఇవ్వడంతో తాము కోర్టును ఆశ్రయించినట్లు ఉపసర్పంచ్ తెలిపారు. లబ్ధిదారునికి గ్రామంలో మరో స్థలాన్ని కేటాయిస్తామని చెప్పినప్పటికీ తమను వ్యక్తిగతంగా దూషిస్తున్నారంటూ ఉపసర్పంచి చెప్పారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఉపసర్పంచ్‌పై చింతలపల్లి పద్మ కుటుంబ సభ్యులు మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేశారు

సమస్యల కంటే సొమ్ములపైనే శ్రద్ధ
జన్మభూమి సభలో అధికారుల నిలదీత

ప్రజాశక్తి - గోపాలపురం

అధికారులకు ప్రజల ఇబ్బందులను సొమ్ముచేసుకోవడంలో ఉన్న శ్రద్ధ, వారి సమస్యలను పరిష్కరించడంలో లేదని వెంకటాయపాలెం ఉపసర్పంచి దుగ్గిరాల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని కొమటికుంట, రాజంపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిపలుకులు, నాయకులచే, అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. జన్మభూమి కార్యక్రమానికి పూర్తి స్థాయి సమాచారంతో పలు శాఖల అధికారులు హాజరుకావల్సి ఉండగా వారికి బదులు అధికారుల సహాయకులు సభలను నిర్వహిస్తున్నారని ఉపసర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచి రమేష్ మాట్లాడుతూ అధికారులు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని, ప్రజా సమస్యలు పట్టించుకొనే స్థితిలో విద్యుత్ శాఖ అధికారులు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల తీరు మరింత దారుణంగా ఉందన్నారు. పట్టాదారీ పాస్ పుస్తకాల కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేదని వాపోయారు. ముడుపులు మాత్రం విధిగా దండుకుంటున్నారని ఆరోపించారు.పక్క మండలాల్లో ఆన్‌లైన్ విధానాల్లో సక్రమంగా పాలన జరుగుతుంటే కేవలం గోపాలపురం మండలంలోనే ఎందుకు ఆన్‌లైన్ కావడం లేదని వడ్లమూడి రాజేంద్రప్రసాద్ అనే రైతు అధికారులను నిలదీశారు. కార్యక్రమానికి విఆర్ఓ ప్రతినిధిగా వచ్చారని, తహశీల్దార్ సమాధానం చెప్పాలని రైతు పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మేణ్ణి రత్నాజీ, ప్రత్యేక అధికారి జి.శ్రీనివాసరావు, ఎపిఒ జెవి.రమణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జన్మభూమి'

ప్రజాశక్తి - కొవ్వూరు

జన్మభూమి సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని, షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ తెలిపారు. మంగళవారం ఒకటో వార్డులో జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న జవహర్ మాట్లాడుతూ చంద్రన్న సారథ్యంలో ప్రతి ఇంటికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జె.రాధారాణి, ఆర్‌డిఒ వై.సత్యనారాయణరావు, ఎఎంసి ఛైర్మన్ వేగి చిన్నా, జన్మభూమి ప్రత్యేక అధికారి ఎస్‌వివి.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.రాజారామేష్, వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ, టిడిపి నాయకులు జెవిఎస్.చౌదరి, బి.రాఘవులు పాల్గొన్నారు.

చాగల్లు : స్థానిక గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచి జొన్నగూటి వెంకయ్యమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి జవహర్ మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.రేఖారాణి, కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పిఎల్.వరలక్ష్మి, వేగి చిన్నా, సర్పంచ్ జొన్నగూటి వెంకయ్యమ్మ, సీనియర్ టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, ఆ పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు రాజు, కరుటూరి సతీష్, కొడూరి ప్రసాద్, ఎంపిడిఒ కె.పురుషోత్తమరావు, తహశీల్దార్ ఎం.మేరికమ్మ పాల్గొన్నారు.

పెరవలి : మండలంలోని ఉసులుమర్రులో మంగళవారం జన్మభూమి మాఊరు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉసులుమర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికి, సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి ఐదో విడత కార్యక్రమం



చాగల్లు గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి జవహర్

దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు అధికాల రమ్యశ్రీ, టిడిపి మండల అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి, సర్పంచ్ వీరమళ్ల భూలక్ష్మి, బొడ్డు రామాంజనేయులు, తహశీల్దార్ జితేంద్ర, ఇఒ మహాలక్ష్మి పాల్గొన్నారు.

తీపర్రులో..

ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తీపర్రులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఎండిఓ ఎస్‌టివి.రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. అర్హులైన వారందరికీ పించన్లు, రేషన్‌కార్డులు, నూతన గృహాలు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో జన్మభూమి స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి, డిసిఎంఎస్ ఛైర్మన్ రవివర్మ , సర్పంచ్ గుమ్మడి సంగీతరావు, సొసైటీ అధ్యక్షులు కరుటూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లపూడి : ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేసి సంపూర్ణ సంతోష ఆంధ్రప్రదేశ్ సాధనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని మండలంలోని తాడిపూడి గ్రామంలో మంత్రి జవహర్ ప్రారంభించారు. జన్మభూమి సభకు విచ్చేసిన మంత్రికి మండల ప్రత్యేక అధికారిణి గౌషియా బేగం పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. జన్మభూమి సభలో ఎంపిపి కె.అనంతలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు మంగా భవాని, కొవ్వూరు ఆర్‌డిఒ సత్యనారాయణ, ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, ఉప సర్పంచి గంటా కృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు జన్మభూమి ఐదో విడత కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని 1, 2, 4 వార్డుల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాల మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐసిడిఎస్ స్టేట్ కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేక అధికారి ఎం.మోహనరావు, మున్సిపల్ కమిషనర్ జి.కృష్ణమోహన్, ఎఇ అచ్యుతుడు పాల్గొన్నారు.

మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, జీడిగుంట గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమం మంగళవారం మండల అభివృద్ధి అధికారి ఎ.ఆంజనేయులు, తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మీకాంతం పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహించారు.

దేవరపల్లి : ప్రజా సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయమని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు కొయ్యలమూడి సుధారాణి అన్నారు. మండలంలోని గౌరీపట్నం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.రామ్మోహనరావు, తహశీల్దార్ వై.రవికుమార్, సర్పంచి మెరిపో వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి కొటారు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

జన్మభూమి మాఊరు కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని స్థానిక ఎంపిపి ఎస్‌వి.నర్సింహరావు అన్నారు. మండలంలోని బంధపురం, గౌరీపట్నం గ్రామాల్లో మంగళవారం జన్మభూమి మాఊరు గ్రామ సభలు నిర్వహించారు. బంధపురం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి జమ్మి వెంకటలక్ష్మి, ఉప సర్పంచి కట్రాగడ్డ పరమేశ్వరరావు, ఎంపిడిఒ కె.కోటేశ్వరరావు, ఎంపిటిసి పి.సుబ్బారావు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం అందజేత

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో ఉన్న ఎస్‌పిఆర్ స్పిన్నింగ్ మిల్ అధినేత వంకా రవీంద్రనాథ్ గ్రామస్తుల కోరిక మేరకు ఎస్‌పిఆర్ స్పిన్నింగ్ మిల్ ఆవరణలో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో మల్లేశ్వరం, ఖండవల్లి, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టలవేమవరం, లంకమాలపల్లి గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. దీంతో ఫ్యాక్టరీ చుట్టు పక్కల గ్రామాల ప్రజల కష్టాలు తీరతాయని వారు భావిస్తున్నారు. సబ్ స్టేషన్‌కు స్థలం సేకరించడంలో భూమిక పోషించిన డిఎంఎస్ ఛైర్మన్ రవివర్మ, కోటిపల్లి మురళీకృష్ణ, తప్పాపు నాగేశ్వరరావు, అతికాల శ్రీను, మేడిచర్ల బుజ్జిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సేవలందించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాల ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందించాలని నాబార్డు డిడిఎం బివిఎస్.రామప్రభు అన్నారు. జంగారెడ్డిగూడెం, వేగవరం, కామవరపుకోట, చింతలపూడి డిసిసిబి బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు వాటిపరిధిలోని 35 సహకార సంఘాల కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు సహకార సంఘాలు మల్టీ కో ఆపరేటివ్ సంఘాలుగా అభివృద్ధి సంఘాల్లో డిజిటలైజేషన్, కంప్యూటరీకరణ వాటి లాభాలపై స్థానిక సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామప్రభు మాట్లాడుతూ మారుతున్న వ్యాపారరంగంలో వస్తున్న టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా సంఘాలను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్ళొచ్చన్నారు. రానున్న రోజుల్లో ప్రస్తుత వాణిజ్యబ్యాంకులు అందిస్తున్న సేవలకు ధీటుగా సొసైటీల్లో కూడా సేవలను విస్తృతం చేయాలన్నారు. ఉద్యోగులందరూ కంప్యూటరీకరణ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్యాక్‌డెవలప్‌మెంట్ సెల్ అధికారి కె.సూర్యప్రకాష్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబులిటీ రుణాలు, కౌలురైతులకు రుణసౌకర్యాలను సొసైటీ బ్యాంకుల ద్వారా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అధికారి ఎండివిఎం.వర్మ స్థానిక సొసైటీ సిఇఒ టి.కిషోర్‌కుమార్, 35 సంఘాల సిఇఒలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి ప్రకాష్‌బాబు

తాగునీటి ట్యాంకర్ వితరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బొర్రంపాలెం పంచాయతీ ప్రజలకు జూపల్లి సాయిబాబు జ్ఞాపకార్థం భార్య వరలక్ష్మి కుమారుడు వంశీకృష్ణ రూ.1.75 లక్షలతో తాగునీటి టాంకర్‌ను పంచాయతీకి అందించారు. ఈ టాంకర్‌ను సర్పంచి పొట్నేళ్ల అచ్చమ్మ సమక్షంలో మాజీ ఎంపిపి కొత్తా ప్రకాష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రజావసరాలకు ట్యాంకును బహూకరించడం అభినందనీయమని దాతలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పొట్నేళ్ల సుబ్బారావు, పడాల సత్యనారాయణ, మాజీ సర్పంచి పెండ్యాల మల్లిబాబు, కొనకళ్ల సత్తిబాబు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక అమ్మానాన్న వికలాంగ సేవాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాకల అహల్య జ్ఞాపకార్థం వెంకటనారాయణ వికలాంగులకు మంగళవారం విందు ఏర్పాటుచేశారు. అలాగే వికలాంగులకు ఆరు కుర్చీలను సేవాశ్రమానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు డి.ఆంజనేయులు కార్యదర్శి మండెల నాగరాజు పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న దాతలు

పరిహారం లేదు.. ప్యాకేజీ లేదు..!

పోలవరం నిర్వాసితుల ఆవేదన
పరిహారం కోసం ఎదురుచూపులు
ఉపాధి లేక నరకయాతన
పనులకోసం సుదూర ప్రాంతాలకు వలసలు
యువతకు అందని పరిహారం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పేరుతో హడావుడిగా గ్రామాల నుంచి తరలించి సంవత్సరాలు గడిచిపోతున్నప్పటికీ పరిహారంపై నేటికీ అధికారులు నోరుమెదపడం లేదని పలువురు నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనిచేసిన ఆర్‌డిఒ, తహశీల్దార్లు గ్రామాలను ఖాళీ చేయించే క్రమంలో వారికి తోచినట్లు వ్యవహరించి నిర్వాసితులను పునరావాస గ్రామాలకు తరలించడమే ధ్యేయంగా పెట్టుకుని నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతూ గ్రామాన్ని ఖాళీ చేయించారని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో చేగొండపల్లి, రామయ్యపేట, పైడిపాక, దేవరగొంది నిర్వాసిత మహిళలు తమ గోడును ప్రజాశక్తి వద్ద వెలిబుచ్చారు. గ్రామాలను ఖాళీ చేయించే క్రమంలో 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ప్యాకేజీ, భూమికి భూమి, సాగు భూములు ఇచ్చి ఇళ్లకు పరిహారం, చెట్లకు పరిహారం సంతృప్తికరంగా అందించి పునరావాస గ్రామాలకు సాగనంపుతామని కల్లబొల్లి కబుర్లు చెప్పి పరిహారాలు ఇవ్వకుండానే ఖాళీ చేయించారని పలువురు వాపోయారు. కొంత మంది గ్రామస్తులనే బ్రోకర్లుగా నియమించుకుని వారి ద్వారా మిగిలిన వారిని ఖాళీ చేయించారన్నారు. ఆర్‌డిఒకు, తహశీల్దారుకు ఎదురు తిరిగిన వారిపై కక్షసాధింపు చర్యగా చెక్కులు నిలిపివేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఆర్‌డిఒ, తహశీల్దార్లు వారిహయాంలో చేసిన తప్పులకు ఇప్పుడు కొత్త ఆర్‌డిఒ, తహశీల్దారు వద్ద తమకు సరైన న్యాయం జరుగుతుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టేకు చెట్లకు పరిహారం ఇవ్వలేదు
సిహెచ్.నరసమ్మ, చేగొండపల్లి

ఎన్నో సంవత్సరాలుగా కొండపోడులు సాగు చేసుకుంటూ వస్తున్నాం. ఐటిడిఎ ద్వారా ఇచ్చిన టేకు మొక్కలను కూడా ఆ పోడు భూముల్లో పెరిగి పెద్దవయ్యాయి. వాటికి సైతం నష్టం పరిహారం ఇస్తామన్నారు. నేటికి ఇవ్వలేదు. ప్యాకేజ్ రూ.1.20 లక్షలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ.50 వేలు పునరావాస గ్రామాలకు వెళ్లిన తరువాత ఇస్తామన్నారు. నేటికీ ఇవ్వలేదు. ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రాజెక్టు మొదలైతే ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డాము. ప్రాజెక్టులో పనులు చూపించలేదు. పునరావాస గ్రామాల్లో ఉపాధి పనుల్లేకుండా పోయాయి. బతుకుభారంగా మారి ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్లావల్సి వస్తుంది. ఒడ్డునపడ్డ చేపల్లా కొట్టుకుంటున్నాం. అడవితల్లి దగ్గర ఉంటే ఆకో అలమో తింటూ కట్టెలు అమ్ముకుని అయినా బతికేవాళ్లం.. అధికారులు స్పందించి ఉపాధి కల్పించాలి.

యువతకు ప్యాకేజీ ఇవ్వలేదు
సత్యం కాశీ వెంకటరామలక్ష్మి, రామయ్యపేట

భూముల ధరలు పెంచుతామని హామీలిచ్చి జంగారెడ్డిగూడెం దగ్గర గుర్వాయిగూడెం పంచాయతీలో ఇళ్లు కట్టించి ఇచ్చారు. భూములకు ధరలు పెంచలేదు. 18 సంవత్సరాల యువతీయువకులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. రామయ్యపేట నుండి వంద కుటుంబాలు పైడిపాక నుండి 50 కుటుంబాలు గుర్వాయిగూడెం పంచాయతీలో ఉంటున్నాయి. కోళ్ల ఫారాల దగ్గర ఇళ్లు కట్టారు. ఈగలు, అపారిశుధ్యంతో అనారోగ్యాల పాలవుతున్నాం. తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నాం. మాయమాటలు చెప్పి ఖాళీ చేయించిన ఆర్‌డిఒ తదీశీల్దారులు పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు వచ్చిన ఆర్‌డిఒ, తహశీల్దారును ఏ విధంగా అడగాలి. వారికి గతంలో జరిగిన విషయాలు తెలుస్తాయా? మాకు న్యాయం జరిగేనా? ఉన్న భూములు లాక్కున్నారు. ఉపాధి లేదు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించాలి.

యువతను మోసగించారు
పెనుగొండ సుబ్బలక్ష్మి, పైడిపాక

గ్రామాన్ని ఖాళీ చేయించేప్పుడు ఆర్‌డిఒ, తహశీల్దారు 18 సంవత్సరాల యువతకు పరిహారం చెక్కులు ఇస్తామని మభ్యపెట్టి ఖాళీ చేయించారు. చెక్కులు ఇచ్చే విషయంలో వయస్సు తేడాలు చూపారు. చెక్కు ఇచ్చిన వారి వద్ద నుంచి 20 శాతం లంచాలు అడిగారు. ఇవ్వడానికి నిరాకరించిన 11 మంది చెక్కులను వెనక్కి తీసుకున్నారు. బ్యాంకుఖాతాల్లో డబ్బులు నిలిపివేశారు. అంతేకాక తప్పుడు వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారంటూ కేసులు కూడా నమోదు చేయించారు. బ్లాక్‌మెయిల్ చేసి పోలీసులతో ఇబ్బంది పెట్టించారు. పూర్తి పరిహారాలు అందని పది కుటుంబాలు పైడిపాక గ్రామాల్లో ఉన్న నేటికీ వారికి పరిహారం అందలేదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలి. ఇంటికో ఉద్యోగం అన్నారు. చదువుకున్న యువతకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. వెనక్కి తీసుకున్న చెక్కులను అందించాలి.

బెదిరించి ఖాళీ చేయించారు
బొరగం చిట్టెమ్మ, మామిడిగొంది

గ్రామం నుండి తరలించేటప్పుడు అన్నిపరిహారాలూ సక్రమంగా ఇస్తామన్నారు. సంతకాలు పెట్టిన చెక్కులను వెనక్కి తీసుకున్నారు. 18 సంవత్సరాల యువతకు ప్యాకేజ్ ఇవ్వనేలేదు. డీఫారం పట్టా ఉన్న భార్యభర్తల్లో ఎవరో ఒకరికి మాత్రమే ప్యాకేజీ ఇచ్చారు. కొంతమంది గ్రామంలో బ్రోకర్లకు రెండేసి చెక్కులు ఇచ్చారు. నిజంగా పరిహారాలు అందాల్సిన వారికి ఆర్‌డిఒ తహశీల్దారును ఎదిరించారనే నెపంతో చెక్కులను ఎగ్గొట్టారు. రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలకు కూడా గ్రామాల్లో ఉండి బెదిరించి మరీ ఖాళీ చేయించారు. గ్రామాలు ఖాళీ చేసి వచ్చిన తరువాత పునరావాస గ్రామాల్లో ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నాం. పరిహారాలు సక్రమంగా అందజేయాలి.

గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌డిఒను పిలిపించాలి
సున్నం వెంకటలక్ష్మి, రామయ్యపేట

రామయ్యపేట గ్రామంలో ఉన్న గిరిజన కుటుంబాలను, గుంజవరం సమీపంలోని సింగన్నపల్లి గ్రామానికి తరలించారు. పునరావాసాలకు తరలివెళ్తే గిరిజనులకు ఇచ్చినట్లుగా ప్యాకేజీ ఇస్తామని మాయమాటలు చెప్పి తరలించారు. ఇప్పటికీ ప్యాకేజీ ఇవ్వలేదు. భూమికి భూమి ఇస్తామని ఇవ్వలేదు. సర్వేచేసి పరిహారాలు నమోదు చేసుకున్నారే తప్ప పునరావాసాలకు తరలివెళ్లినా న్యాయం జరగలేదు. ఇప్పుడు అడిగితే కలెక్టరును అడగమంటున్నారు. తరలించేటప్పుడు రాని కలెక్టరు ప్రస్తావన ఇప్పుడు ఎందుకు వచ్చింది. గతంలో పనిచేసిన ఆర్‌డిఒను తహశీల్దారును పిలిపించి పరిహారాల విషయంలో నిర్ధారించుకుని నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారాల బకాయిలు చెల్లించాలి.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'జన్మభూమి-మా ఊరు' : ఎంఎల్ఎ సుజాత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి జన్మభూమి మాఊరు కార్యక్రమం వేదికవుతుందని చింతలపూడి శాసనసభ్యులు పీతల సుజాత అన్నారు. మంగళవారం స్థానిక రెండో వార్డులో జన్మభూమి - మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత జన్మభూమిలో ప్రజలనుండి సుమారు 6600 వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించామని తెలిపారు. వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు, వంటగ్యాస్ తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, ఆర్‌డిఒ కె.మోహనకుమార్, జన్మభూమి ప్రత్యేక అధికారి అమ్మాజీ, కమిషనర్ కెవి.కొండలరావు, నగరపంచాయతీ సిబ్బంది, టిడిపి నాయకులు మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తాఫా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలను తొలగించండి : ఎంపిపి శీలం

టి.నరసాపురం: చెరువుల ఆక్రమణలను తొలగించాలని ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమం మంగళవారం అప్పలరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అప్పలరాజుగూడెం గ్రామసభలో గ్రామానికి చెందిన నీటిసంఘం అధ్యక్షులు వెదుళ్లపల్లి శ్రీనివాసరావు మరికొందరు స్థానిక గోవిండ్‌సాగర్ చెరువు ఆక్రమణకు గురైందని వాటిని తొలగించాలని రెండేళ్లుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఎంపిపి మాట్లాడుతూ ఆక్రమణకు గురైన చెరువులను గుర్తించి 24 గంటల్లో వాటిని తొలగించాలని లేనిపక్షంలో పేదప్రజలు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణకు దిగుతారని అధికారులను హెచ్చరించారు. మండలానికి 450 వికలాంగ, వృద్ధాప్య, వితంతు పింఛన్లు మంజూరయ్యాయని, వీటిని ఈ నెల 11వ తేదీన టి.నరసాపురంలో జరిగే జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు ద్వారా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు ద్వారా 16 మంది గర్భిణులకు సామూహిక శీమంతాలు నిర్వహించారు. 33 మందికి రేషన్‌కార్డులు అందించారు. ఉపాధి కూలీలకు గునపాలు, జాబ్‌కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తి, పిన్నమనేని మధు, ఆచంట సూర్యనారాయణ, సర్పంచి పొడియం విజయలక్ష్మి, ప్రత్యేక అధికారి కుమార్, చిలుకూరి విశ్వనాథం, వెలిచేటి నాగేశ్వరావు, నాళం కాశి, ప్రసాద్, ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ ఎన్.నాగరాజు పాల్గొన్నారు.(ప్ర.వి)

కొయ్యలగూడెం :మండలంలోని రామాంజుపురం గ్రామంలో ఎంపిడిఒ ఎం.రాజు ఆధ్వర్యంలో, నరసన్నపాలెం గ్రామంలో తహశీల్దారు ఎ.కృపాజ్యోతి ఆధ్వర్యంలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభల్లో ప్రధానంగా పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు తదితర విషయాలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. ఆయా కార్యక్రమాల్లో పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, జడ్‌పివైస్ ఛైర్మన్ చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, సర్పంచి ముప్పిడి వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపిపి పారేపల్లి శ్రీను, ఎంపిడిఒ ఎం.రాజు, అగ్రికల్చర్ ఎడి కమలాకరశర్మ, ఎఒ పోశారావు, నాయకులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, పరిమి రాంబాబు, నల్లూరి గోపి పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు చేరడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఏలూరు ఎంపీ మాగంటి బాబు అన్నారు. మండలంలోని రామాంజుపురం గ్రామంలో జన్మభూమి మా ఊరు - కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవిభజన అనంతరం నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న నవ్యాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు విశేషంగా శ్రమిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలోని సీసీ రోడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌ఛైర్మన్ చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, వైస్‌ఎంపిపి పారేపల్లి శ్రీను, సర్పంచి ముప్పిడి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పరిమి రాంబాబు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.రాజు, ఎడి కమలాకర్‌శర్మ, హార్టీకల్చర్ ఎఒ హరిచంద్, ఇరిగేషన్ ఎఇ సిహెచ్.భాస్కర్, డాక్టర్ ఎం.సౌజన్య, నల్లూరి గోపి పాల్గొన్నారు.

లింగపాలెం: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు లింగపాలెం మండల ప్రత్యేక అధికారి గణేష్ కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు పెదబాబు తెలిపారు. మంగళవారం కె.గోకవరం, పుప్పాలవారిగూడెంలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్, ఎంపిపి మల్లికార్జునరావు, ప్రజాప్రతినిధులు మువ్వ బాబూరావు, జాన్సీ, శ్రీమన్నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.(ప్ర.వి)

'జన్మభూమి' వల్ల ఒరిగేదేమీ లేదు : మాలమహానాడు

ప్రజాశక్తి - ఆచంట

మూడు సంవత్సరాలుగా టిడిపి ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆచంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందన్నారు. వందల కోట్లు ప్రచారానికి వెచ్చించి వందలాది మంది అధికారుల ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం వాటి పరిష్కార విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల రెండో తేదీ నుంచి జరగనున్న జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సరెళ్ల శ్రీనివాస్, రావి నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఆచంట: గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసేందుకు తనవంతు కృషి చేస్తానని సర్పంచి బీరా తిరుపతమ్మ అన్నారు. ఆచంట పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో తిరుపతమ్మ మాట్లాడుతూ గ్రామ సభలో వచ్చిన సమస్యలను జన్మభూమి కార్యక్రమంలో ప్రస్తావిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ఎప్పకటిప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి లక్ష్మణరావు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంఎల్ఎ సత్యనారాయణ పుట్టినరోజు

పాలకొల్లు: మాజీ ఎంఎల్ఎ అల్లు వెంకట సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నాలుగు సార్లు ఎంఎల్ఎగా ఎన్నికైన ఆయన చేత వైసిపి పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీ, చినమిల్లి గణపతి, శీలం సూరిబాబు, వాసా కోటేశ్వరరావు, తాళ్ల వసంతరావు, కావలి శ్రీను కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. పాలకొల్లు పట్టణాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రజలు మరువలేరని చినమిల్లి గణపతి కొనియాడారు.

కబడ్డీలో విశ్వతేజ విద్యార్థుల ప్రతిభ

పెనుగొండ:స్వామి వివేకానంద జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సెట్‌వెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో విశ్వతేజ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీలో ప్రథమ స్థానం సాధించి కళాశాలకు పేరు తెచ్చారని ప్రిన్సిపల్ పులిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం. నాగబాబు, అధ్యాపకులు అభినందించారు.

నరసాపురంలో జన్మభూమి

నరసాపురం:మంగళవారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమం స్థానిక ఒకటి, రెండు, మూడు, ఐదో వార్డులకు సంబంధించి కౌన్సిలర్ల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నమాలసాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందక సురేష్‌బాబు, కాగితపు దుర్గాభవాని, పొన్నాల నాగబాబు, తిరుమాని శశిదేవి, అబేదా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

ఈ రోడ్డు.. అస్తవ్యస్తం..

అధ్వానంగా కవిటం - కొవ్వూరు రోడ్డు : పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పోడూరు



జిన్నూరు సమీపంలో అధ్వానంగా మారిన రోడ్డు

మండలంలోని నరసాపురం వయా కవిటం, కొవ్వూరు వెళ్లే ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా భారీ గోతులు ఏర్పడడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. నిరంతరం వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణించాలంటేనే నరకయాతన పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు తరబడి అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాధుడే లేడని వాపోతున్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆర్అండ్‌బి ఎఇ జి.రవి రోడ్డు నిర్మాణానికి నిధులు సమకూరాయి, వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పినా నేటికీ ఏ పని జరగలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులున్నా పనులు ఆలస్యం దేనికని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ప్రమాదాలకు గురికాక ముందే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రూ.10 నాణేల మార్పిడి కష్టాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో, రాష్ట్రంలో రూ.10 కాయిన్స్ మారక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సమస్యను ఆర్‌బిఐ దృష్టికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎస్‌సి యునైటెడ్ ఫ్రంట్ మంగళవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫ్రంట్ అధ్యక్ష కార్యదర్శులు బివి.రావు, ఎస్‌బి.రాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పది రూపాయల కాయిన్స్ మారక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలెక్టర్, ఆర్‌బిఐ అధికారులు కాయిన్స్ తీసుకోవాలని చెబుతున్నా వ్యాపారులు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఆర్‌బిఐ అవసరమైతే పాత కాయిన్స్‌ను రద్దు చేసి కొత్త కాయిన్స్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతులు అధైర్యపడొద్దు : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి

దాళ్వా సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టామని, దీనిపై రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పొలంబాట కార్యక్రమంలో భాగంగా గంగడపాలెం, లక్ష్మీపాలెం, వడ్డిలంక, యలమంచిలి లంక, చించినాడ, కాజ, ఊటాడ, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో వడ్డిలంక ఛానల్ గుండా సుమారు 22 కిలోమీటర్ల మేర రామానాయుడు పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు స్వయంగా రైతుల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ భాస్కర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, దొంగరావిపాలెం వద్ద వెంటనే ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని, దగ్గులూరు, అరటకట్ల, వద్దిపర్రు వద్ద పైపులైన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నాలుగు రోజుల్లో సాగునీటి సరఫరాను మెరుగుపరుస్తానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ పొత్తూరి రామాంజనేయులు, జెడ్‌పిటిసి సభ్యులు నాని, సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందంజ : మంత్రి పితాని

పెనుమంత్ర:అధికారులు సమన్వయ దృష్టి చూపితే ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించవచ్చని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో జరిగిన జన్మభూమి, మాఊరు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి పితాని సత్యనారాయణ విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. ప్రస్తుతం ఎస్‌ఐపర్రులో లాకుల మరమ్మతులకు, రహదారి నిర్మాణానికి సరిపడే నిధులు ఉన్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టేందుకు అంతరాయం ఏర్పడిందన్నారు. అనంతరం ఎస్‌ఐపర్రు, మల్లిపూడి గ్రామాల్లో గర్భిణులకు సీమంతం చేశారు. పిహెచ్‌సిలో వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారులు గంగయ్య, సోషల్ వెల్ఫేర్ అధికారి జెఆర్.లక్ష్మీదేవి, పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు సత్యసాయి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

పితాని దృష్టికి సమస్యల వెల్లువ

జన్మభూమి, మాఊరు కార్యక్రమానికి విచ్చేసిన పితాని సత్యనారాయణకు ఆయా గ్రామాల ప్రజల నుండి సమస్యలు వెల్లువెత్తాయి. వాటిలో ఎస్‌ఐపర్రు లాకుల పరిధిలో 400 ఎకరాలకు గొడ్డుమోతు ఛానల్ ద్వారా సాగునీరందడం లేదని, దీంతో చేలు బీడు వారుతున్నాయని గ్రామానికి చెందిన రైతులు కంకటాల సింహాచలం, పంపన సాంబశివరావు మంత్రికి తెలిపారు. ఎస్‌ఐపర్రు నుండి వేల్పూరు, తణుకు నూతన రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని పితాని దృష్టికి తీసుకొచ్చారు.

పెనుగొండ: 5వ విడత జన్మభూమి కార్యక్రమం మంగళవారం దొంగరావిపాలెం, సిద్ధాంతం, రామన్నపాలెం పంచాయతీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పల్లి జూలి సురేఖ, జెడ్‌పిటిసి సభ్యులు రవికుమార్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందించాలి

ప్రజాశక్తి - నరసాపురం

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిర్వాసితులైన కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహకారం అందజేసి, పక్కా ఇళ్లు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సబ్‌కలెక్టర్‌ను కోరారు. పట్టణంలోని 22వ వార్డు కొత్త కాలనీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సిపిఎం బృందం పర్యటించింది. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిర్వాసితులైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదేసమయంలో అక్కడకొచ్చిన సబ్‌కలెక్టర్‌తో సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ప్రమాదానికి గురైన ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నగదును అందజేయాలన్నారు. అలాగే స్థలం మంజూరు చేసి వారికి పక్కా గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో ఆధార్, రేషన్‌కార్డులు, విద్యార్థుల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లను అందేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొన్నాడ రాము, దుడిద జోగేశ్వరావు, పున్నాని అప్పలనాయుడు, కొర్రాడి బద్రి, ఒల్లు రమణ, రుంకాని సుజాత రామ్మూర్తి పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి త్రిమూర్తులు

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం గ్రామం అల్లు చంద్రశేఖర్ ఇంటి వద్ద నాగులమ్మ తల్లి ఐక్య వడ్రంగి పని వాళ్ల సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి అల్లు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి సిఐటియు డివిజన్ కార్యదర్శి తెలగంశెట్టి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికే ఉపయోగించాలన్నారు. చంద్రన్న బీమాకు సంబంధం లేకుండా చేసి సంవత్సరం నిండిన కార్మికులకు రూ.మూడు వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిధులను భవన నిర్మాణ కార్మికులకు తప్ప ఏ ఇతర పథకాలకూ ఉపయోగించరాదన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను అల్లు చంద్రశేఖర్, పంచాయతీ బోర్డు మెంబర్లు పన్నా బాబూరావు, ముద్దులా రామచంద్రరావు, ముద్దాల నాగేశ్వరరావు, ఏలూరి లక్ష్మి అందజేశారు. ఈ సమావేశంలో దివి పూర్ణచంద్రరావు, అల్లు రామారావు, గుంటూరి కృష్ణ, మల్లిపూడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపిపి కె.సరోజిని అన్నారు. జన్మభూమి, మాఊరు కార్యక్రమాలను పురస్కరించుకుని గ్రామాల్లో ముగ్గులు, క్రీడా పోటీలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ విద్యార్థినులకు ముగ్గులు, విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా బాలికలు వేసిన ముగ్గులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోడ్రన్ టీచర్ వై.వెంకటరత్నం, హెచ్ఎం సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్ఎన్.ప్రసాద్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎఎస్ఎన్ ప్రసాద్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎఎస్ఎన్.ప్రసాద్ అన్నారు. మొగల్తూరు యుటిఎఫ్ భవనంలో కె.బ్రహ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి గోపీమూర్తి ఆధ్వర్యంలో నూతన మండల యుటిఎఫ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షునిగా ఎఎస్ఎన్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు ఎ.నరసింహమూర్తి, ఎ.కృష్ణకుమారి, కోశాధికారిగా ధర్మారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్.సువర్ణరాజు అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కనకదుర్గ, మాజీ కార్యదర్శి జయప్రభ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి.నరసింహారావు, జి.వెంకటేశ్వరరావు, ప్రసాద్, పొదిల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎంఎల్ఎచే అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.15.20 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, రూ.7.30 లక్షల నిధులతో నిర్మించిన ప్రహరీగోడ, రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు వారు బహూకరించిన రూ.లక్ష విలువైన 20 డెస్కులను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బోనంనాని, ఎంపిపి బొప్పన సుజాత, సర్పంచి పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, ఉప సర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు, సిరాల రంగారావు పాల్గొన్నారు.

నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని స్వర్ణాంధ్ర విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సత్రశాల రమేష్‌బాబు అన్నారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐటి, ఎంసిఎ విభాగాలు సంయుక్తంగా పైథాన్ ప్రోగ్రామింగ్‌పై నిర్వహిస్తున్న ఐదు రోజులు వర్క్‌షాపును మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఇటీవల కాలంలో ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర విద్యాసంస్థల పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఎంబడెడ్ సిస్టమ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, పిఎల్‌సి స్కాడా, ఆటోకేడ్, కాటియాకి మొదలైన సాంకేతిక అంశాలపై శిక్షణిచ్చారని చెప్పారు. స్వర్ణాంధ్ర విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎస్.కీర్తికుమార్ మాట్లాడుతూ ఆటోమేషన్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యాన్ని పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస కుమార్ పిలుపునిచ్చారు. పైథాన్ ప్రోగ్రామింగ్ ద్వారా విద్యార్థులకు ఆల్‌టైమ్ ప్రాజెక్టులు చేయాలని ఐటి విభాగాధిపతి డాక్టర్ రామాయణం ప్రసాద్ చెప్పారు. ఎంసిఎ విభాగాధిపతి ఎఎన్ఎల్.కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించే బిట్‌డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లెర్నింగ్ విభాగాల్లో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర విద్యాసంస్థల ట్రెజరర్ కెఇ.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, సిఎస్ఇ డిపార్ట్‌మెంట్ అధిపతి వై.వంశీధర్, ట్రైనింగ్ స్కిల్ ఇన్‌ఛార్జి వి.కిరణ్మయి, వివిధ శాఖాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమి నియోజకవర్గ ప్రత్యేకాధికారులు వీరే

ప్రజాశక్తి-ఏలూరు

జిల్లాలో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమ పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమించిందని జిల్లా కలెక్టర్ కాటంనేనిభాస్కర్ తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గానికి ఆర్అండ్ఆర్ స్పెషల్ కమిషనర్ జి.రేఖారాణి, నిడదవోలుకు మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఆచంట నియోజకవర్గానికి ప్లానింగ్ బోర్డు మెంబర్ కార్యదర్శి డాక్టర్ బి.గంగయ్య, పాలకొల్లు నియోజకవర్గానికి యూత్ సర్వీసెస్ ప్రత్యేక కమిషనర్ కమల్‌కిశోర్, నరసాపురానికి మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కె.కన్నబాబు, భీమవరం నియోజకవర్గానికి మైన్స్ కార్యదర్శి బి.శ్రీధర్, ఉండికి సర్వశిక్షాభియాన్ ఎస్‌పీడీ గుర్రాల శ్రీనివాసులు, తణుకుకు కల్లోల్ బిస్వాస్, తాడేపల్లిగూడేనికి ఉద్యాన శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఉంగుటూరుకు కార్మిక శాఖ డైరెక్టర్ డి.వరప్రసాద్, దెందులూరుకు పంచాయతీరాజ్ స్పెషల్ సెక్రటరీ డాక్టర్ ఎస్ఎస్.శ్రీధర్, గోపాలపురానికి కృష్ణా డెల్టా సిఇ వైఎస్.సుధాకర్, పోలవరం నియోజకవర్గంతోపాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు సిఆర్‌డిఎ స్పెషల్ కమిషనర్ డాక్టర్ పి.సుబ్బరాఘవయ్య, చింతలపూడికి చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జెఎస్ఎన్.మూర్తులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు.


కారెం శివాజీ పర్యటన ఇలా..

ప్రజాశక్తి - ఏలూరు


ఎపి ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ ఈ నెల ఐదో తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండున్నరకు రాజమండ్రి నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి సాయంత్రం ఐదు గంటలకు ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం చేరుకుంటారు. అక్కడ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తూర్పుగోదావరి జిల్లా మాగం బయల్దేరి వెళ్తారు. తిరిగి ఈ నెల ఏడో తేదీ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు గంటకు మాగం గ్రామం నుండి బయలుదేరి మూడు గంటలకు జంగారెడ్డిగూడెం చేరుకుంటారు. అక్కడ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం యానాదుల మహాసభకు హాజరవుతారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్తారు.

12 నుంచి పాలకొల్లులో వాలీబాల్ టోర్నమెంట్

పాలకొల్లు : సంక్రాంతి సందర్భంగా యువత కోడిపందేలు, గుండాట వంటి చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా పాలకొల్లులో ఈ నెల 12, 13, 14 తేదీల్లో దక్షిణ భారతస్థాయి ఇన్విటేషన్ మహిళా, పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ (ఎంఎల్ఎ కప్) నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక బిఆర్ఎంవి హైస్కూల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు, మొత్తం బహుమతులుగా రూ.మూడు లక్షల నగదు అందజేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతికి క్రీడలను ప్రోత్సహించాడనికి మూడు సంవత్సరాలుగా ధర్మారావు ఫౌండేషన్ తరపున రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించామని, ఈ ఏడాది దక్షిణ భారత స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలను 14వ తేది భోగి రోజున ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజు సాయంత్రం బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని చెప్పారు. మహిళలకు నియోజకవర్గస్థాయి ముగ్గుల పోటీ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, మున్సిపల్ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి, వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, జెడ్‌పిటిసి సభ్యులు బోనం నాని, ఎంపిపిలు పి.శ్రీదేవి, బొప్పన సుజాత, టిడిపి నేతలు, ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు



క్రీడాకారులను అభినందిస్తున్న రామచంద్రరాజు

ఫెన్సింగ్ వంటి వినూత్న క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-పెనుగొండ

ప్రభుత్వం సాధారణ క్రీడలతోపాటు ఫెన్సింగ్ వంటి వినూత్న క్రీడలను ప్రోత్సహించాలని ఎస్‌వికెపి అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఫెన్సింగ్ జట్టు ఎంపిక ప్రక్రియ ప్రారంభోత్సవ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ నడింపల్లి సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. ఎంపిక ప్రక్రియ ముగిసిన అనంతరం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా రామచంద్రరాజు, గౌరవ అతిథిగా కళాశాల కోశాధికారి వి.లవకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరాజు మాట్లాడుతూ తమ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం వినూత్నంగా, సమర్ధవంతంగా ప్రణాళికలు రూపొందిస్తుందని ప్రశంసించారు. పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోర్డు మెంబర్ కె.అమ్మన్నచౌదరి మాట్లాడుతూ ఫెన్సింగ్ జట్టు ఎంపిక ప్రక్రియకు 42 మంది హాజరవ్వగా ఎనిమిది మందిని ఎంపిక చేశామని తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.బాపిరెడ్డి, జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల సంఘం కార్యదర్శి ఎస్.సతీష్, టి.కళ్యాణి, పి.శ్రీనివాస్, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తొలిరోజు జన్మభూమి సభలకు నామమాత్ర స్పందన

మండల, పట్టణ, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్న చోటే జనం హాజరు

ప్రచారం లేకుండా సభ ఏమిటంటూ దొరమామిడిలో అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఒకటి, ఏడు వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాలు మంగళవారం గందరగోళం నడుమ ప్రారంభమయ్యాయి. రెండుచోట్లా అంతంతమాత్రంగానే ప్రజలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. గతంలో జన్మభూమి సభలు రెండు నుంచి నాలుగు గంటలపాటే సాగేవి. మొత్తం ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనేవారు. అయితే ప్రస్తుతం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక్కో వార్డులో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో రెండుచోట్లా జనం లేక వెలవెలబోయాయి. ఒకటో వార్డులో జరిగిన జన్మభూమి సభలో మున్సిపల్ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి, వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, కౌన్సిలర్లు యలకల వరలక్ష్మి, జివి, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాల్గొనడంతో కొద్దిసేపు సందడి నెలకొంది. ఏడోవార్డులో అయితే ప్రజాప్రతినిధులు, ముఖ్యులు రాకపోవడంతో ఉదయంపూట అంతంతమాత్రంగానే జన్మభూమి సభ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి అధికారులు వెనుదిరగడంతో శిబిరాలు ఖాళీ అయ్యాయి. పట్టణ ఎస్ఐ రెహమాన్ వచ్చినప్పుడు ఎవరూ లేకపోవడంతో ఆయన వెనుదిరిగారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు రావడంతో జనంతో కళకళలాడింది.

జీలుగుమిల్లి : ప్రజాసమస్యల పరిష్కార వేదికగా చెబుతున్న జన్మభూమి గ్రామసభలు మండలంలో మొదటిరోజు వెలవెలబోయాయి. మంగళవారం ములగలంపల్లి, పి.గంగన్నగూడెం పంచాయతీల్లో ఎంపిడిఒ అన్నపాలిన, తహాశీల్దారు రాజశేఖర్ పర్యవేక్షణలో గ్రామసభలు జరిగాయి. ములగలంపల్లి గ్రామ సభకు సర్పంచి బేతి దుర్గమ్మ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పథకాలు చెప్పడంతోపాటు ప్రజా సమస్యలపై వినతులపై స్పందించాల్సిన ప్రజాప్రతినిధులు ఈ సభలకు గైర్హాజరయ్యారు. అన్నీ తానై టిడిపి మండలాధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం గ్రామసభలను నడిపించారు. ప్రజలు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇతర సమస్యలపై ప్రశ్నిస్తే ఇప్పటికే చాలా చేశామని, అవన్నీ తర్వాత మాట్లాడుకుందామంటూ ప్రభుత్వ పథకాలపై ఉపన్యాసాలతో ముగించారు. ములగలంపల్లి సభలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు సీమంతం నిర్వహించారు. టి.గంగన్నగూడెం సభలో రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సభలో మండల వ్యవసాయాధికారి కె.పార్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ముందస్తు ప్రచారం లేకుండా జన్మభూమి సభలు ఎలా నిర్వహిస్తారంటూ మండలంలోని దొరమామిడి సీతప్పగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభించిన సభను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. సభ ప్రారంభించి శాఖల వారీగా ప్రభుత్వ పథకాలను వివరిస్తుండగా గ్రామస్తులు అక్కడకు చేరుకుని అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత ఉడతా వెంకటేష్ మాట్లాడుతూ జన్మభూమి సభల గురించి మైక్, టముకు ద్వారా ప్రచారం ఎందుకు నిర్వహించలేదని నిలదీశారు. గ్రామంలో చాలా సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేదెవరని ప్రశ్నించారు. సమస్యలపై గతంలో వినతులిచ్చినా పట్టించుకోలేదన్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జన్మభూమి ఆందోళన చేపట్టారు. దీనిపై ఇన్‌ఛార్జి తహాశీల్దార్ జి.ఉదయ్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సభ నిర్వహణకు సహకరించాలని కోరారు. అయితే గ్రామస్తులు ముందస్తు సమాచారం లేకుండా సభ నిర్వహించడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేయడంతో సభ నిర్వహించకుండానే అధికారులు వెనుదిరిగారు.



దొరమామిడిలో సభను అడ్డుకుని మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకటేష్



పాలకొల్లు ఒకటో వార్డులో జనం లేకుండానే సాగుతున్న జన్మభూమి సభ